చిన్న నవలల పోటీలో మొదటి బహుమతి రు. 2500/- లు పొందిన నవల

# సుందరం

ఘండికోట బ్రహ్మాజీరావు



కొండా మీదీ వెండీగిన్నె
కొక్కి రాజూ కాలూ విరిగె
మందాకేదో చెప్పేవయ్యా
చందామామా దండాలయ్యా.

గంపమీద కూర్చున్న సింహాచలం లేచి నిల్చబడింది. ఫ్లష్‌లైట్ల వెలుతురు చాలా హెచ్చుగా ఆమెమీదపడుతున్నది. చీరకుచ్చిళ్లు దులిపింది. తొడలవరకు మీదికి ఎత్తికట్టింది. పైటతీసి పృధువక్షం మధ్యనుంచి వెనుకకు తీసి దోపుకుంది. ఆమెకు కుడివేపు ఎడమవేపు గంపలు బోర్లించుకొని కూర్చున్న పదిమంది చెలికత్తెలు లేచి నిలబడ్డారు. ఆమెకుమల్లే చీరలు ఎత్తి కట్టుకున్నారు.

వాళ్ల చుట్టూ రాత్రి డ్యూటీకివచ్చిన మగాళ్లు కూర్చున్నారు. రాత్రి పదకొండుగంటల వేళ. పన్నెండు గంటలకు షిఫ్టు మారుతుంది.

సింహాచలం మళ్లా పాడడం మొదలుపెట్టింది.

చెలికాడొచ్చీ చేయీ పట్టి
చెక్కిలినొక్కి చెవిలో చెప్పి
మబ్బూ చాటుకు పోవా నీవు
మంచీ వాడవు కావా నీవు!
చందామామా చందామామా!

ఇటు అయిదుగురు, అటు అయిదుగురు - నిలబడ్డ చెలికత్తెలు "చందామామా, చందామామా" అని వెనుక పాట అందుకున్నారు.

సింహాచలం ఒకడుగు ముందుకు వేసింది. సవిలాసంగా చేతులుతిప్పి అభినయించింది. పాడుతూ మరి రెండడుగులు ముందుకు వేసింది. అభినయంలో మందగతి మధ్యమానికి చేరుకుంది. చెలికత్తెలు వెనుక పాట పాడుతున్నారు. మరి రెండడుగులు అభినయిస్తూ సింహాచలం సాగింది. తారాస్థాయిలో ఆమె అంగాలు కదుల్తున్నాయి. చుట్టూ కూర్చున్న వాళ్లు ఒళ్లు మరచి చూస్తున్నారు.

ముందుకు వచ్చినట్లే, అడుగులు క్రమంగా వేసుకుంటూ సింహాచలం పాడుతూ, అభినయిస్తూ వెనుకకి నడిచింది. తారాస్థాయినుండి క్రమంగా మధ్యగతికి, చివరకు మందగతికి చేరుకుంది.


సింహాచలం గొంతుక చాలా శ్రావ్యమైనది.

ఆమె ముక్కు సంపెంగపూవులా ఉండనే ఉంది. ఆమె శరీరచ్ఛాయ కూడ సంపెంగరంగే. పాతిక సంవత్సరాల వయస్సులో ఆమె ఒంటి వంపులు అన్ని వయసులవారిని కదిపి పారేస్తాయి. మనిషి ఒడ్డూ, పొడుగూ ఉండడం చేత మామూలు వాళ్ళకి అందుబాటులో ఉండదు.

పాట ముగిసింది. సింహాచలం, ఆమె చెలికత్తెలు నిలబడే ఉన్నారు. ప్రేక్షకులనుండి వీరాసామి లేచి నిలబడ్డాడు.

"ఇక్కడ కూర్చున్న మగాళ్ళలో ఎవరైనా ముందుకొచ్చి సింహాచలాన్ని కావలించుకుంటే పదిరూపాయలిస్తాను." అన్నాడు వీరాసామి.

కూచున్న మగాళ్ళందరూ లేచినిలుచున్నారు అందరూ ఆలోచిస్తున్నారు. సింహాచలం కౌగిలి అంటే రంభ పరిరంభమే. సందేహం లేదు. స్వర్గం కోసం తపస్సు చేయనక్కర లేదు.




Bali

అక్కడ నిలబడ్డ రసికులెవరూ ముందుకు రావడంలేదు.

"ఒకటి, రెండు.... నేను పదిచెప్పేసరికి ధైర్యమున్నవాడు సింహాచలాన్ని కావలించుకోవాలి. కాకపోతే ముడుచుకొని కుక్కలా వెళ్ళిపోవాలి."

పీరాసామి లెక్కపెడుతున్నాడు.

"మూడు, నాలుగు... తొమ్మిది..."

సింహాచలం పతివ్రత కాదు.

మొగుడు ముసిలాడని విడిచిపెట్టింది. తమ్ముడింటికి చేరుకుంది. సింహాచలానికి తల్లి ఉంది. తండ్రి లేడు. తల్లి బొగ్గులేరు కుంటుంది. సింహాచలంకూడా ఆ పనే చేస్తుంది. ఇంజన్ల షెడ్డులో పగలు తల్లి, రాత్రి కూతురు బొగ్గులేరు కుంటారు. బొగ్గు లమ్ముకుంటారు. కాలిన బొగ్గులు మాత్రమే ఏరుకోవాలి. కాలినవాటి మాటున పచ్చిబొగ్గులు కూడా వాళ్ళు దాచుతారు. పగలు అటువంటి అవకాశాలు తక్కువ. రాత్రిపూట అవకాశాలు ఉంటాయి. వాటిని మెరుగుపరచడమే సింహాచలం చేసేపని.

సింహాచలం పెరట్లో ఒక సంపెంగ చెట్టుంది. రాత్రి తిండితిని, కొప్పులో రెండు పూలు ముడుచుకొని, ఒడిలో నాలుగుపూలు ఉంచుకొని సింహాచలం ఇంజన్ల షెడ్డుకు వస్తుంది. ఆమెతో మరో పదిమంది చెలికత్తెలొస్తారు. అందరూ బొగ్గుల కుప్పలకు సమీపంలో ఉన్న దిబ్బమీద, ఫ్లడ్‌లైటు వెల్తురులో బుట్టలు బోర్లించి కూర్చుంటారు. రోజుకో చెలికత్తె పాడుతుంది, మిగిలిన వాళ్ళు వెనకపాట పాడి, ఆమెతోపాటు అడుగులు వేస్తారు. ఈ రాత్రి సింహాచలం వంతు - పాట, ఆట అయిన తరువాత, పన్నెండు గంటల రాత్రికి షిఫ్టు మారి, పనివాళ్లు మారిన పిమ్మట, సింహాచలం చిన్నదొర కూర్చున్న ఆఫీసు కిటికీదగ్గిర నిలబడుతురిది. ఒడిలోనున్న సంపెంగపూవు ఒకటి తీసి చిన్న దొర చూస్తున్న డైరీమీదికి విసురుతుంది.

ఆ దొర తలెత్తి చూడడు. సంపెంగపూవు తీసుకొని వాసనచూస్తూ డైరీ చదువుతుంటాడు.

ఒక అయిదు నిమిషాల తరువాత ఆమె మరొకపూవు విసురుతుంది. దానికికూడా దొరతలెత్తడు. రెండోపూవు పక్కను పెడతాడు.

"ఓయి మనుమడా!"

మరో అయిదు నిమిషాల తరువాత మూడోపూవు డైరీ మీదికి విసిరి సింహాచలం చాలా తీయగా పిలుస్తుంది.

"యూ బిచ్! యూ డోన్ట్ ఎలవ్ మీ టువర్క్!"

ఆ దొరలేస్తాడు. వాడికి ఒక కాలు సొట్ట. యుద్ధంలో ఆ కాలు పోయిందంటాడు. ఎంతవరకూ నిజమో! అందుకోసమే వాడు 'యుద్ధం జరుగుతున్నా ఇంజన్ల షెడ్డులో పని చేయగలుగుతున్నాడు.

వాడి భుజంమీద సింహాచలం తన చేయివేస్తుంది.

ఇద్దరూ ఫ్లడ్‌లైటు వెలుతురు పడనిచోటికి మాట్లాడుకుంటూ నడుస్తారు.

పదిమంది చెలికత్తెలు పరుగుపరుగున బుట్టలతో పచ్చిబొగ్గు మోసుకు పోతారు. ఆ బొగ్గుకు ధర హెచ్చు.

సింహాచలం నాట్యభంగిమలో వెనక్కి నడిచేటప్పుడు రెండు చేతులు తల వెనుకకు పెట్టుకొంది. ఆ విధంగానే నిలబడి, పీరాసామి పందానికి ముందు కొచ్చే మగాడెవరని అందరివేపు చూస్తున్నది.

నిలబడ్డ వాళ్లందరూ సింహాచలం రోజూ చూస్తున్నవాళ్ళే. ధైర్యం లేని మగాళ్ళనుచూసి ఆమె నవ్వుతున్నది.

ఈ విధంగా నాలుగు రోజులయి పీరాసామి సవాలుచేస్తునే ఉన్నాడు; ధైర్యం చాలని పెద్దమనుషులు గుడ్లు మిటకరించుకుంటూ పేలవంగా నవ్వుకుంటూ వెళ్ళిపోతున్నే ఉన్నారు.

పీరాసామి 'పది' అనే లోపలే ఒక అనుకోని పని జరిగింది.

కళ్ళుమూసి తెరచేలోపల ప్రేక్షకుల మధ్యనుండి ఒక మనిషి ముందుకు రావడం, బలమైన తన బాహువులతో సింహాచలాన్ని బంధించడం జరిగాయి. సింహాచలం తన వశంలో బొమ్మలా నిలబడలేదు. తన తల వెనుకనున్న చేతులు రెండూ కౌగిలించుకున్నవాడి తల వెనుకకుమార్చి, వాడి తలను తన వేపుకువంచి, పెదవులను గాఢంగా చుంబించింది.

ఈ భంగిమలో ఆ జంట లోకాన్ని మరచి పోయినట్లుంది.

పది నిమిషాలకాలం రెప్పపాటులో ముందుకు నడిచింది.

చూచేవాళ్ళు స్థాణువులై నిలబడిపోయారు.

పీరాసామి ఒక్కసారి మామూలు ప్రపంచంలోకి వచ్చాడు.

తన కళ్లను తానే నమ్మలేక పోయాడు.

కాలుపడ్డ తాచుపాములా బుసలుకొట్టాడు. ప్రక్కనే పడివున్న చువ్వ నొకదానిని తీసుకొని లోకంతో సంబంధం లేకుండా ఆలింగనముద్రలో ఐక్యమైపోయిన జంటలో పురుషుడిని బలంగా కొట్టాడు.

"ఓరి ఓప్లెస్ (హూప్లెస్) నా కొడకా! నీ కెన్ని గుండెలున్నాయిరా! సింహాచలాన్ని ముట్టుకోడానికి నువ్వు తగుదువురా? చుట్టూ ఉన్నవాళ్ళకన్న నువ్వు గొప్పోడివిరా? అడుక్కుతిని బతికిన.... కొడకా? జాతిలేని పింజారీ నీతి నీకెందుకుంటుందిరా! ఈ సింహాచలం, చిన్నదొర ప్రాపకంలోని సింహాచలం, ఈ చక్కని చుక్క సింహాచలం - దీని కాలిగోరుకి నువ్వు పోలవురా! పోయేకాలం దాపురించిందిరా!...." తరువాత వినలేని బండబూతులు తిడుతూ చువ్వతో కొడుతూ ఆ జంటను విడదీశాడు.

అప్పటికి రాత్రి పదకొండున్నర అయింది.

పీరాసామికి చాల ముఖ్యమైన పనొకటుంది. కాగడా ముట్టించి చిన్న దొర బంగళాకు పరుగెత్తాలి. సరిగా పావు తక్కువ పన్నెండుకు దొరని లేపాలి. ఆ దొర పది నిమిషాలలో తయారవుతాడు. అతనికి కాగడా వెలుతురులో దారి చూపించాలి. ట్రేలో దొరగారి కాఫీ పాట్, సాండ్‌విచ్ పాక్‌ని పెట్టుకొని నడవాలి. అన్నిటికన్న ముఖ్యం హోప్‌లెస్‌గాడి ఘోరమైన నేరాన్ని చిన్నదొరకి చెప్పాలి. ఎవరూ చెప్పకముందే చెప్పాలి. దొర అనుగ్రహం పొందడానికి మూర్తిమీద, గురునాథం పంతులుమీద, నరసింహ రాజుమీద ఎన్నో చాడీలు చెప్తునే ఉన్నాడు. వాటివలన అంత ఫలితం కనిపించడంలేదు. దీనితో చిన్నదొర దారిలోకి రాకేం చేస్తాడు? ఏదో దొరలు పెట్టిన భిక్షేకదా తనకి ఉద్యోగం. ఇల్లువట్టిన బావమరిదికో నౌకరీ దొరికితే కోటలో పాగావేసినట్లే. పనిచేయకుండా, చుట్టమీద చుట్ట కాలుస్తూ, పీడిమీద వాడిమీద దొరకి కబుర్లు చెప్పుకుంటూ హాయిగా బ్రతకవచ్చు.

సింహాచలం ఇంకా సుఖపారవశ్యం నుండి తేరుకోలేదు.

హోప్‌లెస్‌గాడు తలవంచుకొని బండరాయికిమల్లె నిలబడ్డాడు.

పీరాసామి పరుగులుతీశాడు.

మిగిలిన ప్రేక్షకులు చాలని వారించారు. మట్టిబుక్కడం వంటి హోప్‌లెస్‌గాడు ఇటువంటి పని చేస్తాడని వాళ్ల కలలోకూడ అనుకోలేదు. వాడంటే అందరికీ జాలి. అభిమానం - స్వంతమైన కొడుకు తన ఎదుటే చేయరానిపని చేసినప్పుడు తండ్రిపడే బాధ వారందరి ముఖాలలోను కనిపిస్తున్నది.

పీరాసామి దొరగారి బంగళా చేరేసరికి అయిదు నిమిషాలు ఆలస్యమయింది. చిన్నదొర ఆసరికే లేచాడు. బంగళాలో అన్నిలైట్లు వెలుగుతున్నాయి. పీరాసామి చాలా గాభరాగా తలుపుతట్టి లోపలికి ప్రవేశించాడు.

చిన్నదొర, విరగని కాలుకు మేజోడు ఎక్కిస్తున్నాడు, సోఫాలో

కూర్చొని.

"బ్లడీ బిగర్ ! ఎందుకురా లేటయింది ?" చిన్నదొర ఉరిమాడు.

"సార్, సార్ ! చాల ముఖ్యమైన సంగతి సార్ !" అన్నాడు వీరాసామి జావోస్తూ.

"బ్లడీ ఫూల్ ! గాడిదలా జావోస్తున్నావెందుకురా ! ఈ దొర ప్రాణం పోవాలి కాని డ్యూటీకి లేటవడని తెలిసినా ఎందుకు ఆలస్యంగా వచ్చావురా,"

"కాదుసార్ ! మన సింహాచలాన్ని, కాదు, కాదు, తమరి సింహాచలాన్ని హోప్‌లెస్‌గాడు, రాత్రి డ్యూటీ మనుషులందరూ చూస్తుంటే, సిగ్గూ శరమూ లేకుండా కౌగిలించుకొని ముద్దెట్టుకున్నాడు సార్...."

జోడు, ఆ ఉన్న ఒక్క మంచి కాలుకు తొడుక్కోకుండా, చంకలో కర్రపెట్టుకొని చిన్నదొర నిలబడిపోయాడు.

"డబల్ బారల్‌గన్ - అర్జంట్ !" దొర పిచ్చివాడిలా అరుస్తున్నాడు.

"వద్దుసార్ ! అడుక్కుతినే ముండాకొడుకు సార్ !...."

"హంటర్, హంటర్ !"

సింహాచలం మామూలుగా పన్నెండున్నర వేళకు చిన్నదొర కిటికీదగ్గరకి వచ్చి నిలబడింది. చేతిలో చిగురాకుల మధ్యనున్న బంగారం రంగులోని సంపెంగపూవుని దొర డైరీమీద విసరబోయి. ఆగిపోయింది.

లోపల జరుగుతున్నది. చూస్తుంటే ఆమెకు ఒళ్ళు మండిపోయింది. చేతిలోని పూవును నలిపినలిపి నేలను విసిరికొట్టింది.

## 2

మూర్తి పని పంచాడు. పనివాళ్ళందరూ వెళ్ళిపోయారు, ఒక్క హోప్‌లెస్ తప్ప.

గురునాధం పంతులుకూడా తన పనివాళ్ళను పంపించాడు.

మూర్తి, గురునాధం పంతులు ఇంజన్ల షెడ్డులో సూపర్‌వైజర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరిదీ ఒకే షిఫ్టు. గురునాధాన్ని అందరూ గురువుగారని పిలుస్తారు. అతను ఇంజను బాయిలర్ శాఖకు సంబంధించిన మనిషి. మూర్తి ఫిటింగ్ పనులు చూస్తాడు.

మూర్తికి పాతిక సంవత్సరాలకు మించిన వయసులేదు. పందొమ్మిదో ఏటే ఉద్యోగంలో ప్రవేశించాడు. అతను నీలి ఖద్దరు నిక్కరు, తెల్లటి ఖద్దరు షర్టు తొడుక్కున్నాడు. చొక్కామీద చేతులులేని నెహ్రూకోటు తొడుక్కున్నాడు. కాళ్ళకి బూట్లు వేసుకున్నాడు.

గురునాధం పంతులికి ముప్పై అయిదేళ్ళు. అతను పదహారు సంవత్సరాలయి ఉద్యోగం చేస్తున్నాడు. మనిషి పొట్టిగా సన్నంగా ఉంటాడు. ఫంట్లాం తొడుక్కొని, తెల్లగా ఇస్త్రీ మడతలలోనున్న చొక్కా వేసుకున్నాడు. కళ్ళకి జోడుంది, కాళ్ళజోడు పాలిష్‌చేసి నిగనిగ మెరుస్తున్నది.

ఇద్దరూ ఇంటర్‌మీడియేటు పాసయినవాళ్లే.

ఇంజన్ల షెడ్డులో ఆ రోజుల్లో వీళ్ళిద్దరే విద్యాధికులు,

గురువుగారికి మంచి అనుభవముంది. దొరల దగ్గిర తలవంచకుండా పనిచేసే ధైర్యముంది. మనిషి పిట్టలా ఉన్నా, చీమ మిరపకాయ వంటివాడు.

"మూర్తీ ! ఈ రాత్రి హోప్‌లెస్‌గాడికి పనివ్వకు. ఇంటికిపోయి పడుక్కోమను. వీడిని సొట్టదొర హంటర్‌తో బాదుతుంటే ఎవరెవరు చూశారో గుర్తుందా ?" గురువుగారు అడిగాడు.

"అప్పిలప్పగాడు, వెంకటస్వామి, ఫకీరు సాహెబు, వీరాసామి......." అన్నాడు మూర్తి.

"వీరాసామిగాడిని వదిలిపెట్టు. మిగిలిన ముగ్గురు కోర్టులో నిలబడి సాక్ష్యం చెప్పగలరా ?"

మూర్తి ఆలోచిస్తున్నాడు.

"ఈ సొట్టదొరని కోర్టుకీడ్చించి ఏడ్పించాలని ఉంది. వీడేమో ఆంగ్లోయిండియన్‌కూడా కాదు. ఇంగ్లండులో వీడికో పెళ్ళాముందట. బ్రిటిష్ వాడినని చెప్పుకుంటాడు. వీడికి జీతంకూడా హెచ్చే." అన్నాడు గురువుగారు.

"ఇతను ఇంగ్లండులో బట్లరుగా ఉండేవాడు. ఇతని యజమానిని హిందూదేశం పంపించినపుడు ఇతనినికూడా ఆ యజమాని తీసుకొచ్చాడు. ఇతనికో మంచి ఉద్యోగం ఇచ్చి అతను వెళ్ళిపోయాడు. హిందూదేశానికి సంరక్షకుడనని ఇతను అందరితో చెప్తాడు."

"ఏది ఏమయినా వీడో వెధవ అన్నది నిజం. ఈ బట్లరు ఉద్యోగం చేసిన వెధవకి తన మాతృభాషకూడా రాదు. వాక్యంలో కనీసం అరడజను 'బ్లడీ' లుంటాయి. వీడిరాతలో అన్నీ తప్పులే. వీడికి ప్రపంచజ్ఞానంకూడా అంతంత మాత్రమే. ఆ మధ్య వీడితో మాట్లాడుతూ, జపానువాళ్ళు టోకియో నగరాన్ని బాంబు చేశారని చాల సీరియస్‌గా అన్నాడు, ఆ జోక్ వాడు విని చాల ఆశ్చర్యపోయాడు. ఏదోవిధంగా కాలు విరగ్గొట్టుకొని వీడు మనల్ని పరిపాలిస్తున్నాడు ప్రత్యక్షంగా."


మూర్తి ఆలోచిస్తున్నాడు.

రోజూ ఇద్దరూ ఎవరింటికో పోయి రేడియో వింటారు. టోకియోనుంచి సుభాష్‌బాబు సోదరుడి సందేశాలు వింటుంటారు. బ్రిటిష్‌వారిని భారతదేశం నుండి తరిమివేసే దినంకోసం ఎదురు చూస్తుంటారు.

మూర్తి రోజూ ఇంటిదగ్గిర పెట్టె రాట్నం మీద నూలువడికేవాడు. బీచ్‌లో దేశనాయకులు ఇచ్చిన ఉపన్యాసాలన్నీ విన్నాడు. ఏదో ఒకరోజు ఈ దేశం మనదయినప్పుడు ఏవిధంగా దీనిని తీర్చాలన్న ఆలోచనలలో మునిగి పగటి కలలు కంటుండేవాడు.

"ఎవడయినా పనిచేయనివాడిని, తాగుబోతును శిక్షించినా నేను విచారించను. ఈ హోప్లెస్‌గాడు శరీర నిర్మాణంలో సింహంవలె ఉన్నా, స్వభావంలో మేకవంటి వాడు. ఎవరూ లేనివాడు. అందరి పనివాళ్ళు పెట్టిన తిండితిని బతికినవాడు. పనిలో నూటికి నూరుపాళ్లు విశ్వసించదగినవాడు. రెండేళ్ళయి పనిలో చేరినా, చాలామంది సోమరిపోతులకంటె ఎంతో నయం. వీడిని చిన్నదొర నిర్దాక్షిణ్యంగా పశువుకన్నా హీనంగా బాదాడు. మరొకడయితే ఆ దెబ్బలకక్కడే స్పృహతప్పి పడిపోయేవాడు. వీడికి జరిగిన అన్యాయం మనందరికీ వర్తిస్తుంది. మనం నోరు మూసుకొని ఊరుకుంటే రేపు మనమీద కూడా ఇతను విరుచుకుపడతాడు."

గురునాధం పంతులు లేచినిలబడ్డాడు. గదిలో ఈ కొననుండి ఆకొన



వరకు పచారు చేశాడు ఆలోచిస్తూ.

"వీడిని మనం ఏమీ చేయలేం. కాని వీడిని అదుపులో పెట్టాలి. వీడికి పెద్ద దొరకి మధ్య మంచి అవగాహన ఉంది. మనం వీడిమీద ఫిర్యాదు చేసినా పెద్దదొర మననే చీవాట్లు పెడతాడు. అందరికీ సింహాచలం చిన్న దొర మనిషని తెలుసు. దానినిచూస్తే నాకుకూడా మననుండబట్టదు. ఒరే హోప్లెస్.... ఎందుకీ పని చేశావురా ?"

హోప్లెస్‌గాడు జవాబు చెప్పలేదు. ముఖం దించుకున్నాడు.

"రోజూ నీకు చదువుచెప్పి, నీతులు బోధిస్తున్న మీ బాబుగారు నరసింహారావు, ఇటువంటి పని చేయకూడదని చెప్పలేదా ?" గురునాథం హోప్లెస్ గాడిని ప్రశ్నించాడు.

"చాలసార్లు చెప్పారు. తప్పు చేసినప్పుడు శిక్ష తప్పదన్నారు బాబు గారు." అన్నాడు వాడు.

"నువ్వు తప్పవని చేసినట్లు అంగీకరిస్తే ఎవరం ఏమీ చేయలేం." అన్నాడు మూర్తి.

"అదేను సార్ ! నేను తప్పు చేయలేదని చెప్తున్నాను." అన్నాడు హోప్‌లెస్‌గాడు.

గుమ్మం దగ్గిర నిలుచున్న చిన్నదొరని చూసి మూర్తి నిలబడ్డాడు.

"ఈ బ్లడీ హూప్లెస్‌గాడికి పనెందు కివ్వలేదు ?" దొర ప్రశ్నించాడు మూర్తిని.

"వాడిని ఇంటికి పంపించి వేస్తున్నాను." అన్నాడు మూర్తి.

"పర్మనెంటుగా ఇంటికి పంపిస్తా. ముందు వీడిని స్మోక్‌బాక్స్ క్లీనింగ్‌కి పంపించు" అన్నాడు దొర.

రాత్రి ఇంజన్‌షెడ్ పాలనకు చిన్నదొరే బాధ్యుడు. అతని ఆజ్ఞలు శిరసావహించవలసిందే.

వీడిక్కడ కాలం వ్యర్థం చేయడం పనికిరాదు" మరోసారి చిన్నదొర చెప్పి అక్కడనుండి కాలు ఆడించుకుంటూ నడిచిపోయాడు.

మూర్తి, గురునాథం పంతులు ముఖంలోకి చూచాడు.

గురువు చాలా కోపంగా పళ్లు కొరికాడు. మరేం మాట్లాడకుండా గది నుంచి వెలుపలికినడిచి పనిమీదికి వెళ్ళిపోయాడు.

ఏం చేయడానికి మూర్తికి తోచలేదు.

"ఒరే హోప్‌లెస్ ! నువ్విక్కడ ప్రొద్దున్నవరకు కూచో - నేను సంగతంతా పెద్ద దొరతో చెప్తాను. నువ్వు ఏం నేరం చేశావో, రెండు శిక్ష లనుభవించడం పనికిరాదు. ఇటువంటి పరిస్థితిలో నిస్సహాయులు చేయ వలసినది సత్యాగ్రహం మాత్రమే."

హోప్‌లెస్ చిన్న నవ్వు నవ్వాడు.

"మూర్తిబాబూ! నేను చేసినపనికి మీరుకూడా ఇరుకునపడడం బాగుండదు. పెద్దదొర చిన్నదొర పనిని సమర్థిస్తాడు. ఇప్పటికే మీరంటే వాళ్ల శత్రువులుగా చూస్తున్నారు." అన్నాడు వాడు.

"ఓరిం హోప్లెస్ ! నువ్వు నా క్రింద పనిచేస్తున్నావు. నీకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోడానికా నేనున్నాను ?"

"మీరు ఊరుకోవద్దు. చిన్నదొర చెప్పినట్లు నన్ను పనిలోకి పంపండి. మిగిలిన విషయాలు రేపు పొద్దున్న ఆలోచిద్దాం...."

మూర్తి మరేమీ జవాబు చెప్పలేదు,

అతనికి ఏ ఇంజను మీదికి పోవాలనిలేదు.

అతని ఆలోచనలలో ఒక్క హోప్లెస్‌గాడే ఉన్నాడు.

అప్పుడు వాడు నాలుగేళ్ళ వాడట. వాడి తల్లెవరో, తండ్రెవరో వాడి చేతిలో ఒక సిల్వరు కంచం మాత్రం ఉంది. వాడు కట్టిన నిక్కరుకి చాల చిరుగులున్నవి. మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ, రాత్రి ఎనిమిది గంటలపుడు పనివాళ్లు ఒకచోట భోజనం చేస్తారు. నాలుగేళ్ళ పేరులేని కుర్రాడు కంచం చాపితే ఎవరికి తోచినముద్ద వారు కంచంలో వేసేవారు. కొళాయి దగ్గిర నీళ్లు తాగి, ఆఫీసు వరండాలో రాత్రి పడుక్కొని వాడు పెద్దవాడయాడు. ఎవడో పెద్దమనిషి వాడిని 'హోప్‌లెస్ ఫెలో' అని పిలవడంతో వాడు హోప్‌లెస్‌గా, పాటక జనం నోళ్ళల్లో ఓప్‌లెస్‌గా స్థిరపడ్డాడు. వాడి పదేళ్ళ ప్రాయంనుంచీ పనిలో ప్రవేశపెట్టారు. ఇంజన్ల షెడ్డులో ఒక కాంటీను ఉంది. అప్పుడక్కడ టిఫిన్ తయారుచేసేవారు కారు. ఉదయం మధ్యాహ్నం దూరంగా ఊరిలోనున్న మంచి హోటలునుండి తెప్పించేవారు. టిఫిన్ తెచ్చే కుర్రాళ్లు ఎవరూ స్థిరంగా ఉద్యోగంలో ఉండేవారుకారు. ఒకరోజు ఎవరూ లేకపోతే వీడిని హోటలుకు పంపించారు. ఆనాటినుండి వాడు ఎనిమిది సంవత్సరాలు నిరంతరంగా కాంటీనులో పని చేసేవాడు. ఉదయం, మధ్యాహ్నం వేళపట్టున టిఫిన్ అందుతుండేది. హోటలువారు పొద్దున్న టిఫిన్ ఇచ్చేవారు, మధ్యాహ్నం కాంటీనువారు ఇచ్చేవారు. వాడు చేస్తున్న పనికి జీతమివ్వాలని ఎవరికీ నాలుగేళ్ళదాకా తోచలేదు. సంవత్సరానికి రెండు జతల బట్టలు మాత్రం ఇచ్చేవారు.

మూర్తి ఉద్యోగంలోచేరిన ఆరు నెలలకు నరసింహారావుకూడా చేరాడు. అతను గుమస్తాగా పనిచేసేవాడు. సహజంగా మనిషి చాల ఉత్తముడు. ఒకరికి జరిగే అన్యాయాన్నికూడా సహించలేనివాడు. అతను హోప్‌లెస్‌గాడిని చూచి చాల బాధపడ్డాడు. అతను ఎలక్షన్లలో కాంటీన్ సెక్రటరీ అయాడు. అయిన వెంటనే అతను హోప్‌లెస్‌గాడికో జీతం ఏర్పాటు చేశాడు. ఒకపూట తనయింట్లో భోజనం పెట్టేవాడు. రెండోపూట కాంటీనులో వాడు వండుకునే వాడు. రెండేళ్ళక్రింద వాడికి పద్దెనిమిదేళ్లు నిండగనే పెద్దదొరతో చెప్పి ఒక ఉద్యోగం వేయించి వాడిని మూర్తి దగ్గిర పనిచేయడానికి పంపించాడు.

హోప్‌లెస్‌గాడి బాగోగులు ఆలోచిస్తూ మూర్తి పనిలో మునిగిపోయాడు.

ఉదయం ఆరు గంటలకు మూర్తి ఆఫీసు గదికి తిరిగివచ్చేసరికి హోప్‌లెస్‌గాడు అతని టేబిలు దగ్గిర నిలబడ్డాడు. ముఖంనిండా నల్లటి, కాలిన బొగ్గుధూళి కప్పివుంది - కళ్లు ఎర్రగా ఉన్నాయి - జుత్తుమీద పడకుండా కట్టుకున్న గుడ్డమీదకూడా ధూళి పేరుకుంది.

"మూర్తిబాబూ ! మీరు వీరాసామికి పాకింగ్ పని ఇచ్చారు - అతను బేరింగులలో పాకింగ్‌తీసి, పొయి ముట్టించుకోడానికి పట్టుకుపోయాడు, ఆ యింజను పాసింజరుకు తగిలిస్తారు - పెట్టెలు కాలిపోతాయి...." అన్నాడు వాడు.

మూర్తి పరుగుపరుగున ఇంజనుదగ్గిరకి పరుగెత్తాడు. వీరాసామి చేసిన ద్రోహానికి ఏంచేయాలో అతనికి తోచలేదు. ఇంజను సరిచేసేసరికి ఎనిమిదయింది.

వీరాసామి మీద మూర్తి పెద్ద రిపోర్టు వ్రాశాడు.

వాడిసంగతి తెలిసి నవ్వుకున్నాడు.

చిన్నదొర ఆ రిపోర్టు చింపేశాడని మూర్తికి తెలియదు, వీరాసామికి తప్ప.

## 3

"సుందరం, ఏం జరిగిందో వివరంగా చెప్పు" నరసింహారావు పన్నెండు గంటల వేళ భోజనానికొచ్చిన హోప్‌లెస్ గాడిని అడిగాడు.

హోప్‌లెస్ గాడికి ఏపేరూ లేదు. ఉద్యోగంలో చేరవలసి వచ్చినప్పుడు

తండ్రి పేరు, వాడి పేరు కావలసి వచ్చాయి. తండ్రి పేరు తెలియదని, సంరక్షకుడు నరసింహారావని పుస్తకాలలో వ్రాసుకున్నారు. వాడి పేరు "సుందరం"అని నరసింహారావు పెట్టాడు. ఏ పేరు పెట్టాలో అతనికి తోచ లేదు. భీమారావో, ఘటోత్కచుడో అంటే వాడి ఆకారానికి, బలానికి సరిపడు తుంది. "సుందరం" అని పేరు పెట్టడంలో అతని అభిప్రాయ మేమిటో మూర్తితో ఒకనాడు చెప్పాడు.

ఆంజనేయుడు మహా బలశాలి. చాలసౌమ్యుడు. వీటన్నిటికి మించి అతను సుందరుడు. అతని బాహ్య రూపంలో సౌందర్యం ఎక్కడి నుంచి వస్తుందని మూర్తి ప్రశ్న వేశాడు. వంక తిరిగిన మూతి, తామ్రవర్ణంలో కోతి ముఖం, అతను సుందరుడేమిటి? అతని ముఖంలోకి చూసిన వాళ్ళు ఏదో దివ్యమైన తేజస్సు గుర్తించి, అతను మహా సౌందర్యవంతుడని నమ్ముతారు. ఇక అతని అతః సౌందర్యం గురించి చెప్పనే అక్కరలేదు. వీటన్నిటినీ మనసులో ఉంచుకొని వాల్మీకి సుందరకాండకు ఆ పేరు పెట్టాడు. అటు వంటి సుందరుడుగా ఈ హోప్‌లెస్‌గాడు లోకంలో బ్రతకాలని ఆశించాడు నరసింహారావు.

ఆ సుందరుడు పరమబ్రహ్మచారి.

ఈ సుందరం ఎందుకీ తప్పుపని చేశాడని నరసింహారావు బాధ పడ్డాడు.

ఈ సుందరానికి ఏ అనాథాశ్రమం నుండో గుణవంతురాలైన చదువు కున్న పిల్లను తెచ్చి పెళ్ళిచేయాలనుకున్నాడు. కాని వీడా కలలనన్నీ వమ్ము చేశాడు.

నరసింహారావుకి ఈ హోప్‌లెస్‌ని చూడగానే ఒక కోరిక కలిగింది. ఎవరూలేని మనిషిని మంచి దారిలో పెట్టి ఆదర్శ పురుషుడుగా తీర్చి దిద్దాలని మనసా సంకల్పించాడు.

అందుకే దీక్షగా రోజూ వాడికి రెండు గంటలపాటు చదువు చెప్తూ, మంచి నడవడి అలవరచుకునే దారిలో వాడిని నడిపిస్తున్నాడు. హోప్‌లెస్ గాడికి నరసింహారావంటే దేవుడేనన్నమాట.

సుందరం గడచిన రాత్రి జరిగిన విషయాలన్నీ నరసింహారావుకి వివరంగా చెప్పాడు. అన్నీ చెప్పిన తరువాత అతను వేసినప్రశ్న, "ఎందుకు తప్పు చేశావు" అన్నదానికి మాత్రం జవాబు చెప్పకుండా మౌనం వహించాడు.

"సుందరం! నీకన్నీ మంచి బుద్ధులే నేర్పించాను. నువ్వు చాల ఓర్పుతో వాటిని పాటించి, నలుగురూ సంతోషించేటట్టు మసలుకుంటున్నావు. మనిషనే వాడికి శీలమన్నది చాల ముఖ్యమైనది. అది లేనివాడి బతుకు నిరర్థకమే. నువ్వు చేసిన పని నీ శీలానికే మచ్చ తెచ్చింది. ఒక పొర పాటు చేయడంవలన ఇంతకాలం శ్రమపడి సాధించిన మంచి పేరు నాశనమై పోయింది. నేను పడిన శ్రమ వ్యర్థమయింది. ఇక నీ దారిని నువ్వు పోవచ్చు".


సుందరం ఏమీ జవాబివ్వలేదు. తలవంచుకొని ద్వారంవేపు నడిచాడు. నరసింహారావు వాడిని చూస్తూ ఏమనాలో తెలియక కళ్ళంట జారుతున్న నీళ్ళను కూడా తుడుచుకోలేకపోయాడు.

నరసింహారావు ఒక్కసారి దగ్గుత్తికతో పిలిచాడు.

"సుందరం!"

సుందరం తిరిగివచ్చి అతనికి ఎదురుగా మఠం వేసుకు కూర్చున్నాడు.

"బాబుగారూ! మీరింతగా బాధపడడం దేనికి? లోకంలో ఏమీ కాని వాడిగా బ్రతికాను. నన్ను బాగుచేయాలని మీరు దీక్ష పూనారు. చదువు నేర్పుతున్నారు. తిండి పెడుతున్నారు. ఎన్నో విషయాలు చెప్పి నాకు దారి చూపించారు. తప్పు చేయడం మనుష్యుడి స్వభావం. నేను అన్ని లోపాలున్న మానవుడిగానే నన్ను భావించుకుంటాను. మీరందరూ నేను చాల



## పరిచయం

శ్రీ ఘండికోట బ్రహ్మాజీరావు గారు శ్రీకాకుళం జిల్లా పొందూరులో 1922లో జన్మించారు. ఇంజనీరు వృత్తి కాని తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషులలో ఎం.ఏ.లు పుచ్చుకున్నారు. రైల్వేలో 40 సంవత్సరాలు పనిచేసి రిటయిరయి హాల్దియా డాక్ కాంప్లెక్సులో స్పెషల్ ఆఫీసర్‌గా కూడా ఉన్నారు.

1940 నుంచి నేటి దాకా ఏభయి పయిగా కథలు, తొమ్మిది పయిగా నవలలు రాసి ప్రచురించబడ్డాయి.

ఇంతకి ముందే చెప్పినట్టు శ్రీ బ్రహ్మాజీరావు గారు పశ్చిమ బెంగాలులో నికుల్చియాలో ఉంటున్నారు.

---

పెద్దదయిన తప్పు చేశాననే అంటున్నారు. కాని, నా మనసు మాత్రం నేను చేసిన పని తప్పుకాదని అంటున్నది. అందుచేత తప్పు చేశానన్న చింత నాకు లేదు. మీరు ఒక సంగతి పదే పదే చెప్పారు, పౌరుషం లేని మనిషి చచ్చినా బతికినా ఒకటేనని. నేను చేసిన పని పౌరుషానికి చెందినది. మరి తప్పెలా అవుతుంది?"

"నీ తర్కమేమిటో నాకు అర్థమవడం లేదు. మనిషి శీలానికి, పౌరుషానికి సంబంధ మేమిటి? అన్నిటికన్న విలువయినది శీలం. దానిని కాపాడుకోవడం ముఖ్యం".

"మీరు చెప్పిన తర్కమే మళ్ళా చెప్పవలసి వస్తున్నది. పౌరుషం లేని జన్మ నిష్ప్రయోజనమైనదని మీరే చెప్పారు. నేను శీలానికి భంగం కలిగించే పని చేయలేదు".

"వివరంగా చెప్పు, నీ మాటలలో ఏమి గూఢార్థముందో వింటాను".

"వీరాసామి నాలుగు రోజుల నుండి మమ్మల్ని రెచ్చగొడుతున్నాడు. అందరం సింహాచలం పాట విని, ఆట చూసి పనిలోకి వెళ్ళేవాళ్లము. అతను సింహాచలాన్ని కావలించుకున్నవాళ్లేమగాళ్లన్నాడు. ఆ పని చేయలేనివాడు పౌరుషం లేనివాడన్నాడు. పందెం కాశాడు. రోజురోజుకి అతను విజృంభించి అందరికీ అవమానం కలిగించే మాటలంటున్నాడు. అతని ఆట కట్టించడానికి ఎవరికీ ధైర్యం లేకపోయింది. మరోరోజు ఇటువంటి ప్రసక్తి లేకుండా, మిగిలిన పురుషుల గౌరవం కాపాడటానికి నేను ముందుకొచ్చాను".

"ఒక పని చేసేటప్పుడు మంచి చెడ్డలు బాగా ఆలోచించాలి".

"నాలుగు రోజులు ఆలోచించాను. అయిదో రోజు వీరాసామి ఆట కట్టించాను. మరి అతను జన్మలో ఇటువంటి సమస్యను లేవనెత్తడు".

"నువ్వు వొట్టి మూర్ఖుడివి. అందరి మధ్య వయసులోనున్న ఆడదానిని కావలించుకోవడం నలుగురూ మెచ్చేపనా? అంత మందికి పౌరుషం లేద

నేనా నీ అభిప్రాయం ?"

"కొంతమంది లోకానికి భయపడి, బెదరింపులకు భయపడి, ఉద్యోగానికి భయపడి ఏ పని చేయడానికి ముందుకురారు. నేను చేసిన పని కామానికి లొంగి చేసినదికాదు".

నరసింహారావు నవ్వాడు.

"ఇద్దరూ ఒకరి కౌగిలిలో ఒకరు పది నిమిషాల వరకు ఉండిపోయారు. వీరాసామి నిన్ను చువ్వతో కొడుతున్నా అయిదు నిమిషాల వరకు నువ్వు ఆమె నుండి విడిపోలేదు. దీనికేం సంజాయిషీ చెప్తావు ?"

"బాబుగారు నేను కేవలం పౌరుషంతో ఆమెను కావలించుకున్నాను. కామంతో కాదు; ఆమె నన్ను గాఢంగా కావలించుకొని, నా తలను దగ్గిర తీసుకొని ముద్దుపెట్టుకుంది. పది నిముషాల వరకు నన్ను చేతుల నుండి విడవలేదు. దానికి నేను బాధ్యుడను కాను."

"సుందరం! నువ్వు సింహాచలాన్ని కావలించుకోడం, ఆమె నిన్ను ముద్దుపెట్టుకోవడం బహిరంగంగా చేయవలసినవి కావు. అందరి ఎదుట ఇటువంటివి చేస్తే సిగ్గుచేటు. నలుగురిలో తలెత్తుకొని తిరగలేం".

"నేను ఈ విషయం కూడా చాలా ఆలోచించాను. వీరాసామి మాటలకు అంతం కనిపించలేదు. అప్పుడు నేను రంగంలోకి దిగవలసి వచ్చింది".

"అది నాయకుడెవడో చేయవలసిన పని. నీకా అర్హత లేదు".

సుందరం ఒక క్షణం మౌనంగా ఉండి పోయాడు. తరువాత మెల్లిగా అన్నాడు.

"బాబుగారూ ! నా జీవితం ఎన్నో విషయాలు నేర్పింది. కంఠం పట్టుకొని మనిషి మనిషిని ఒక ముద్ద పెట్టమని అడిగినప్పుడు కొందరు విసుక్కునేవారు, కొందరు కోపపడేవారు, కొందరు పిలిచి పెట్టేవారు. ఒక రోజు తిండి దొరికేది - ఒక పూట ఏమీ ఉండేది కాదు. మసిలో, చలిలో, వానలో, ఎండలో బ్రతికాను. మీ దృష్టిలోపడ్డ తరువాత నా బ్రతుకే మారి పోయింది. ఇపుడు నాకు తిండి సమస్య లేదు. తల దాచుకోడానికి మీరు ఏర్పాటు చేసిన ఇల్లు ఒకటుంది. నాకు అన్యాయం జరిగినందుకు నేను అంతగా పట్టించుకోవడం లేదు, కాని, మరొకరికి జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకోలేక పోతున్నాను. నాయకత్వం వహించే అర్హత నాకుందో లేదో, నాలో ఈ మార్పు మాత్రం తలెత్తుతున్నది".

నరసింహారావు సుందరం వేపు చాల సేపు చూశాడు.

"సుందరం ! కొన్ని నిజాలు చాల కటువుగా ఉంటాయి. నువ్వు నలుగురి ఎదుట సింహాచలాన్ని కావలించు కున్నావు. సిహాచలం చిన్నదొర మనిషి. చిన్నదొర నీ ఉద్యోగం తీయించే సామర్థ్యమున్నవాడు. నేను ఎంతో శ్రమపడి వేయించిన ఉద్యోగం నువ్వు ముందు వెనుకలు ఆలోచించకుండా చేసిన తప్పుపని వలన ఒక్క క్షణంలో ఊడిపోతుంది. అపుడు నీ బతుకు నడివీధి పడుతుంది".

సుందరం పెదవుల మీద పేలవమైన నవ్వు కలిగింది.

"బాబుగారూ ! నేను చేసిన పనికి శిక్ష అమలు పడింది. చాల ఓర్పుతో శిక్షను అనుభవించడమే నేను చేయవలసిన పని. నేను తప్పు చేయలేదని నా అంతరాత్మ చెప్తున్నది. నేను చేసిన పనివలన మీరు ఇబ్బందిలో పడ్డారు. దీనికి నేను చాల విచారిస్తున్నాను. నన్ను క్షమించమని మిమ్మల్ని అడిగే అర్హత కూడా పోగొట్టుకున్నాను.

అప్రయత్నంగా సుందరం కళ్ళు చెమ్మగిల్లాయి.

"సుందరం ! నువ్వు స్వతంత్రమైన అభిప్రాయాలు కలవాడివి కావాలని నేను ఆశించాను. ఆ దారిలో నిన్ను నడిపించాను. నీ అచంచలమైన ఆత్మ విశ్వాసానికి నేను గర్విస్తున్నాను. ఆ ధైర్యంతోనే ముందుకు అడుగు వెయ్యి".

సుందరం మరి మాట్లాడలేదు. భోజనం ముగించి ఇంటి వేపు నడిచాడు.

ఇంజన్ల షెడ్డుకి తూర్పు వేపు నాలుగు బంగళాలున్నాయి. అందులో ఒక దానిలో పెద్దదొర, రెండిటిలో ఇద్దరు చిన్న దొరలు, నాలుగో దానిలో ఒక ఇనస్పెక్టరు ఉన్నారు. నరసింహారావు ఇనస్పెక్టరుగారి ఉత్తరాలు డ్రైవు చేసేవాడు. ఆఫీసు ఫైళ్లు అతనివి నడిపించేవాడు. ప్రతి బంగళాలో ఒక అవుట్‌హౌసుంది. ఒకసారి ఇనస్పెక్టరుగారి అవుట్‌హౌసు ఖాళీ అయితే దానిని సుందరానికిప్పించాడు. ఇల్లిచ్చినందుకు ఇనస్పెక్టరుగారి పూలమొక్కలకు గొప్పులు తవ్వడం, నీళ్లు పోయడం చేసేవాడు సుందరం.

శ్రమపడంది సుందరానికి ఏదీ జీవితంలో లభించలేదు.

ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి కొచ్చి, ఇల్లు చక్కదిద్దుకొని, స్నానంచేసి మడతబట్టలు కట్టుకున్నాడు. అవుట్‌హౌస్‌లో ఒక్క పెద్దగది, చిన్న వంటకొట్టు మాత్రమే ఉన్నాయి. గదిలో ఒకచాప, చిన్న తంగడా, కర్రపెట్టి, దానిమీద కొన్ని పుస్తకాలు, మూలనొక కూజాలో మంచినీళ్లు ఉన్నాయి. సుందరం కొంతసేపు నరసింహారావు చెప్పిన లెక్కలు చేశాడు. తరువాత ఇటు అటు గదిలో పచారుచేసి పదకొండున్నరకు నరసింహారావుగారి యిల్లు చేరుకున్నాడు. అతని భోజనమయిన తరువాత సుందరానికి భోజనం పెడతారు.

భోజనానికి ముందరే నరసింహారావుతో చర్చ జరిగింది.

సుందరం ఇల్లు చేరుకున్నాడు. గది తలుపు తాళం తీసి లోపలి కెళ్ళాడో లేదో, దగ్గరగానున్న తలుపు తోసుకొని సిహాచలం లోపలికి వచ్చింది. ఆమె వచ్చే సరికి సుందరం చొక్కా విప్పి గోడకున్న మేకుకు తగిలిస్తున్నాడు. అతని వీపుమీద నెత్తురు చిమ్మిన చారలు కనిపిస్తున్నాయి. సుందరం వెనక్కు తిరిగి సింహాచలాన్ని చూశాడు.

సింహాచలం నీలంరంగు నేతచీర కట్టుకుంది. జరీ అంచున్న రవిక తొడుక్కుంది. కొప్పు పెట్టుకుంది; కొప్పులో చిన్న రెమ్మతోనున్న సంపెంగ పూవు తురుముకుంది. ఆమె నుదుట కుంకుమ బొట్టు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది.

"సింహాచలం ! నువ్వెందుకొచ్చావు ?" అడిగాడు సుందరం చాప మీద కూర్చుంటూ.

"నావల్ల నువ్వు దెబ్బలు తిన్నావు. నా మనసు మనసులా లేదు. ఒకసారి చూచి పోదామని వచ్చాను." అంది సింహాచలం.

సుందరం మెత్తని నవ్వు నవ్వాడు.

"చూశావు కదా ! నాకు నిద్ర ముంచుకొని వస్తున్నది. నువ్వు వెళ్లేటప్పుడు తలుపు దగ్గిర పెట్టివెళ్లు".

"ఓరి ఓప్లేనూ ! నీ కోసం బాధపడి వస్తే ఇదరా మాట ?"

"సింహాచలం ! నువ్వు దొరగారి మనిషివి. నిన్ను గౌరవంగా చూడాలి. వీరాసామి మాటలకు రెచ్చిపోయి నిన్ను నలుగురిలో కావలించుకున్నాను. దానితో పందెం ముగిసిపోయింది. ఇప్పుడు నేను నేనే - నువ్వు నువ్వే !". సుందరం చాపమీద పడుకున్నాడు.

సింహాచలం ఆ మాటలు వినిపించుకున్నట్లు లేదు. ఎదురుగా నున్న గూటిలోంచి కొబ్బరినూనె తెచ్చి సుందరం పక్కనే కూర్చుంది. మెల్లగా వాడి తలమీదనున్న ఒత్తైన జుత్తులో వేళ్లు పోనిచ్చి కొంచెం సేపు రాసింది. తరువాత ఒంటిమీద నున్న దెబ్బలకు కొబ్బరినూనె మెల్లగా రాసింది.

సింహాచలం కొబ్బరినూనె సీసా గూటిలోపెట్టి వచ్చే సరికి సుందరం నిద్రపోతున్నాడు. ఆమె చాలసేపు వాడి ముఖంలోకి చూచి, మెల్లగా వంగి వాడిని ముద్దుపెట్టుకొని గది నుండి వెలుపలికి నడిచింది.

## 4

గురునాథం పంతులు స్టేషనుకు బయలుదేరాడు.

వారానికి ఒకరోజు సెలవు వస్తుంది. ఆనాడతను విజయనగరం విధిగా వెళ్తాడు. కొత్త వీధిలో ఒకామె ఉంది. ఆమెతో అతను ఖుషీచేసి వస్తాడు. ఈ విషయం అందరికీ తెలుసు. అతనికి పిల్లనిస్తానన్న మేనమామకుకూడా తెలుసు. ఇంటి దగ్గిరనున్న తల్లికి తెలుసు.

గురునాథం పంతులు ఇస్త్రీ మడతలు చేసిన జరీ అంచుపంచ గూడకట్టు చుట్టుకున్నాడు. సిల్కు చొక్కా తొడుక్కున్నాడు. బంగారపు బొత్తాలు, లింక్స్ దానిమీద మెరుస్తున్నాయి. దాని మీద బ్లేజరు కోటు వేసుకున్నాడు. దాని మీద మడతల వాణి ఉంది. కాలికి చెప్పులు తొడుక్కున్నాడు. చేతిలో చిన్న తోలు సూటుకేసు పట్టుకొని అతను స్టేషను వేపు నడుస్తున్నాడు.

వీరాసామికి విజయనగరం సంతలో పనుంది. ఈ మధ్య సంత రోజులలో టికెట్ చెకింగ్ హెచ్చయింది. సాధారణంగా చెకింగ్ స్టాఫ్ రైల్వే వాళ్ళంటే చూచీ చూడనట్లు వెళ్ళి పోతారు. పై అధికారి ఎవడో కొత్తవాడు వచ్చి అందరికి జరిమానాలు విధిస్తున్నాడు. గురునాథం పంతులుకి టిక్కెట్టు కలెక్టరు లందరూ స్నేహితులే.

వీరాసామి తొందరగా అడుగులు వేసి గురునాథాన్ని కలుసుకున్నాడు. అతని చేతిలోపెట్టి తీసికొని వెనక నడిచాడు. గురువు మాత్రం తక్కువ చదువుకున్నాడా? వాడు టిక్కెట్టు డబ్బుకి కక్కుర్తి పడితే, ఆ అవకాశాన్ని అతను బంగారంగా మార్చదలిచాడు.

స్టేషను చేరగానే గురునాథం జేబులోంచి ఒక అయిదురూపాయల నోటు తీసి వీరాసామికిచ్చి రెండు టిక్కెట్లు కొనుక్కొని రమ్మన్నాడు. వీరాసామి కుక్కిన పేనులా మరేం ప్రశ్నలు వేయకుండా రెండు టిక్కెట్లు కొని పట్టుకొచ్చాడు. జేబు నుండి తనవంతు టిక్కెట్టు డబ్బు తీసి ఇయ్యబోతే అతను వారించాడు.

"ఒరే వీరా! నువ్వు నాతో ప్రయాణం చేసేటప్పుడు నా మనిషివి. దేనికీ మొహమాటపడి డబ్బులు తీయడం పనికిరాదు.

వీరాసామి మూడో తరగతిలో గురువుగారి పక్కనే కూర్చున్నాడు. ఒకరిద్దరు టిక్కట్టు కలెక్టరు స్నేహితులు అతనిని సెకెండు క్లాసుకు రమ్మన్నా అతను వెళ్ళలేదు. అతను అక్షరాలా కొయ్యవంటి మనిషి.

తొందరగా సంతలో పని చూసుకొని మెయిలులో వాల్తేరు తిరిగి పోదామనుకున్న వీరాసామి ప్రయత్నాలు ఫలించలేదు. విజయనగరం స్టేషనులో ఇద్దరూ దిగి, పెద్ద చెరువుగట్టు మీద నడుచుకుంటూ కానుకుర్తివారి వీధి చేరేసరికి పదిగంటలయింది. గురువు ఉంచుకున్న దాని దగ్గిరకు పోతాడని వీరాసామి అనుకున్నాడు. అన్నీ ఇవాళ తారుమార్లే అవుతున్నవి.

గురునాథం మేనమామగారి యిల్లు చాలపెద్దది. పెద్ద హాలు, విశాలమైన గదులు, గోడలకు తైలవర్ణ చిత్రాలు, పై నుండి వ్రేలాడుతున్న కాండిల్బ్రాలు, నేలను కాశ్మీరు తివాసీలు ఈ విధంగా చెప్పుకుపోతుంటే ఎన్నో గొప్పింటి వాళ్ళ అలంకారాలు ఆయింట కనిపిస్తాయి. వీరాసామికి ఆయింటికి వెళ్ళడం ఇదే మొదటిసారేమో, మరీ ఆశ్చర్య పోయాడు. గురువు పంతులు పిట్టలా ఉన్న, అతని మేనమామ మాత్రం పొడవుగా, బందోబస్తుగా ఉంటారు.

మేనమామ గురునాథాన్ని పలకరించి, అతనితో వచ్చిన వీరాసామిని కూడా అల్లుడికి మల్లే మర్యాదగా పిలిచి, కుర్చీ చూపించారు. వీరాసామికి కాఫీ, టిఫిను అల్లుడితోపాటు ఇచ్చారు.

కుశల ప్రశ్నలు, ఫలహారాలు, కాఫీలు అయిన తరువాత గురునాథం పంతులే కార్యక్రమం ప్రారంభించాడు.

"మామా! నీతో చాల ముఖ్యమయిన కేసు గురించి మాట్లాడడానికి వచ్చాను. ఈ జిల్లాలో నీకన్న గొప్ప క్రిమినల్ లాయర్ లేరన్నది అందరికీ తెలుసు. ఇందులో నువ్వు నా మేనమామవని, నేను నీకాబోయే అల్లుడనని అనుకోవద్దు. వ్యవహారం వ్యవహారమే, బంధుత్వం బంధుత్వమే". అన్నాడు గురువు.

"చెప్పవయ్యా, ఆ విషయాలన్నీవిడి విడిగా చెప్పు". అన్నారు లాయరుగారు.

గురునాథం ఆ రోజు రాత్రి ఇంజన్ల షెడ్డులో హోప్లెస్‌గాడికి జరిగిన శిక్ష గురించి విపులంగా చెప్పాడు. లాయరుగారు చాల శ్రద్ధతో విన్నారు. అంతా విని అతను అన్నారు.

"ఇందులో మొదటి దోషి - వీరాసామి- పెందుచేత నంటావా, ఇతను సుందరాన్ని రెచ్చగొట్టాడు. దొర ప్రాపకంలోని మనిషి సింహాచలం. అమెకు జరిగిన అవమానం చిన్నదొర సహించడు. చిన్నదొర తన ప్రియురాలిని నలుగురి మధ్య అవమానించిన వాడిని శిక్షించడం సహజమైన పరిణామం. అతను సుందరాన్ని హంటరుతో కొట్టి గాయాలు చేశాడు. అతను రెండవ దోషి. వీళ్ళిద్దరి మీద కేసు పడేయమంటావా?"

"నా దగ్గర సుందరం గాయాల్ని పరీక్షించి, ట్రీట్‌మెంటు చేసిన డాక్టరుగారి సర్టిఫికెటుంది. సాక్షుల వాఙ్మూలాలున్నాయి. నువ్వు వెంటనే కేసు పడేయాలి. అరెస్టు వారెంట్లు ఇద్దరికీ పంపించాలి. ఇందులో దొరకి అట్టే శిక్ష పడకపోయినా ముఖ్యమయిన దోషికి ఆరు నెలలయినా కఠిన శిక్ష పడాలి. దానితో మరెక్కడా గవర్నమెంటు ఉద్యోగం దొరకకూడదు".

"అదెంత పని ఇటువంటివి చాల కేసులు మనం గెలిచాము".

వీరాసామి కుర్చీమీద కూర్చున్నాడేకాని, గాలిలో తేలిపోతున్నట్లు, భూమిలో పెద్ద కన్నం ఏర్పడి అతను పాతాళానికి పడిపోతున్నట్లు అనిపించింది. అంత చలికాలంలోను ముచ్చెమటలు పోశాయి. ఒళ్లు వణికి పోయింది.

గురునాథం పంతులు కోటులోపలి జేబులోంచి పర్సుతీసి నూరు రూపాయలనోటొకటి లాయరుగారి చేతిలో ఉంచాడు.


"ఇది దేనికి?"

"మామా! ఇది లాయరుగారి ఫీజు".

"నువ్వు తెచ్చిన కేసుకు డబ్బు పుచ్చుకుంటానా?"

"మామా! వ్యవహారం వ్యవహారమే, బంధుత్వం బంధుత్వమే. మరో వందరూపాయలు అరెస్టు వారెంటుకయే ఖర్చుల క్రింద పంపిస్తాను. మామా! వస్తాను".

"అదేమిటి, వెళ్ళిపోతున్నావు! మీ యిద్దరికీ భోజనానికి ఏర్పాటు చేశాము".



"మామా ! పెళ్ళయిన తరువాత మీ యింటి భోజనం తప్పదు. కొత్త వీధిలో నా మనిషి ఎదురు చూస్తుంటుంది. వీరాసామీ ! నువ్వు భోజనం చేస్తావా ?"

వీరాసామి అన్న పేరు విని లాయరుగారు ఆశ్చర్యపోయారు.

"లేదుసార్ ! అర్జంటుగా మెయిల్లో వెళ్ళిపోవాలి సార్ ?" అన్నాడు వీరాసామి దగ్గుత్తికతో

"మామా ! సెలవు"

గురునాథం పంతులు వీధిలోకి నడిచాడు. వీరాసామి పరుగు లంకించుకున్నాడు.

వీరాసామి మెయిలు దిగినవాడు ఇంటికెళ్ళలేదు. పరుగు పరుగున చిన్నదొర బంగళాకి పరుగెత్తాడు.

అప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటయింది.

చిన్నదొర సావకాశంగా షేవ్ చేసుకొని, టబ్బులో అరగంట వరకు లవండరు పోసిన వేడి నీళ్ళలో జలకమాడి, ఒళ్ళు తుడుచుకొని, లోపల బనియను అండర్ వేరు మాత్రమే తొడుక్కొని పైని పొడవుపాటి సిల్కు కోటు వేసుకున్నాడు. డైనింగ్ టేబిలు దగ్గిర కూర్చున్నాడు- కుసినీవోడు (అంటే బట్లరన్నమాట) ప్లేట్లులో ఒకటి ఒకటి ఉంచి టేబిలు మీద పెడుతున్నాడు- బౌలులో అనియర్ సూప్ ఉంది. డిష్‌లో స్టఫ్ చికెన్ ఉంది. ఒక ప్లేటులో సలాడ్, మరొక దానిలో రైసు, మరొక దానిలో ఫ్రెంచి ఫ్రై ఉన్నాయి. ముక్కలు కోసి నిమ్మకాయ, సాల్టు, పెప్పరు అన్నీ హంగులతో భోజనం చేయడానికి సన్నద్ధమవుతున్నాడు. ఫోర్కు, చెంచాలు, డిన్నరు ప్లేటు, సైడ్ ప్లేట్లు, ఆప్రన్ అన్నీ కాస్త్ర సమ్మతంగా కుసినీవోడు టేబిలుమీద పెట్టాడు.


సాధారణంగా చిన్నదొర భోజనం చేసే సమయంలో ఎవరినీ లోనికి రానీయడు. ప్రతి రూలుకి చిన్న అమెండుమెంటు ఉన్నట్లే ఒక్క వీరాసామికి మాత్రం ఎమర్జన్సీలలో దొరను చూడడానికి అనుమతి లభిస్తుంది.

రోజూలా వీరాసామి దొరగారి డైనింగ్ రూములోకి ప్రవేశించాడు. కుసినీవోడు వీరాస్వామి ఆకారం చూడగానే ఏదో ప్రమాదం సంభవించిందని గ్రహించి వెంటనే లోపలికి పోనిచ్చాడు.

"బ్లడీ బగర్ ! గాడిదలా జా పోస్తావేం రా ?" దొరగారు అభిమానంగా వీరాసామితో అన్నారు.

"సార్, సార్ ! కొంపమునిగిపోయింది సార్ ! తమర్ని కోర్టు కీడుస్తున్నారు సార్ ! గురునాథం పంతులు మీ మీద కేసు వేస్తున్నాడు సార్".

చిన్నదొర కొంచమైనా చలించ లేదు. తాపీగా ఆప్రన్ తొడల మీద




వేసుకొని బౌలు నుండి ప్రత్యేకమయిన ప్లేటులోకి సూపు పోసుకొని, కొంచెం సాల్టు, పెప్పరు దానిమీద జల్లి చెమ్చాతో ఒకసారి తీసి చప్పరించాడు.

"సార్ ! మీరు దొరలని, శిక్ష వేయడం సాధ్యం కాదని, అందుచేత నాలుగు సార్లు కోర్టుకి తిప్పి, పత్రికలలో వేయించి మీ పరువు తీయిస్తానని గురునాధం పంతులు అన్నాడు సార్ !

సూప్‌బౌన్ పక్కకు పెట్టి దొర, ఎదురుగా నిలబడ్డ వీరాసామి వేపు చూశాడు.

"ఇది నిజమేనా ?"

"వీరాసామి ఎప్పుడేనా అబద్ధం చెప్పాడా సార్ ! రేపే కేసువేయమని, అరెస్టు వారెంటు జారీ చేయించమని క్రిమినల్ లాయరుగారికి నాకళ్ళ ఎదుటే నూరురూపాయలు బయానా ఇచ్చాడు సార్ !

"గురు చాల కరెక్టయిన మనిషి- ఇటువంటి పని చేస్తాడంటే నమ్మకం చాలకుండా ఉంది".

"అవును సార్ ! అతను చాల కచ్చితమయిన మనిషి- అతనికి పుల్లలు పెట్టినవాడు మూర్తిసార్! అతనే మీ మీద పెద్ద దొరకి రిపోర్టు చేస్తానన్నాడు. ఓప్‌లెస్‌గాడిని వెనకేసుకొని నాటకమాడుతున్నాడు సార్ !"

"అదీ సంగతి ! మెత్త మెత్తగా మాట్లాడి, ఖద్దరు బట్టలు వేసే ఈ పెద్దమనిషి ఎంతపనయినా చెయ్యగలడు. మరి, ఇప్పుడేం చెయ్యడం?"

"ఒక్కటే దారుంది సార్ !

"ఏమిటది ?"

"అయిందయింది, అన్నీ మరచి పోవాలని చేతులు కలపాలి సార్ !"

"అంటే అపాలజీ చెప్పాలనా ?"

"అదే సార్ !"

"ఇది మా జాతికే అవమానం రా వీరా !"

"ఈ అవమానం రహస్యంగా ఉంటుంది సార్ ! రేపు పేపర్లో ఫలానా బట్లర్ దొరగారు కోర్టులో బోనెక్కారంటే భరించలేని అవమానం- కేసు కోర్టు కెళ్ళేముందే జాగ్రత్తపడాలి సార్ !"

దొర చాలసేపు ఆలోచించాడు- భోజనమంతా వెనక్కు పెట్టాడు-ఒంటి కాలుతో హాలుతో చాలసేపు పచారు చేశాడు.

"గురు ఎక్కడున్నాడు ? పిలుచుకొనిరా !

"అతను విజయనగరంలో ఉన్నాడు".

"ఎప్పుడొస్తాడు ?"

"రాత్రి డ్యూటీకి వస్తాడు".

రాత్రి చిన్నదొర గురునాధం పంతులు టేబులు దగ్గిర పదకొండు గంటల దగ్గిర నుండి కూర్చున్నాడు- గురునాధం సరిగా పన్నెండు గంటలకు అయిదు నిమిషాల ముందు వచ్చి ఛార్జీ తీసుకున్నాడు- పని పంచాడు. తరవాత చిన్నదొరనివిష్ చేశాడు.

"గురూ ! ఏమిటి సంగతి ?" చిన్నదొర అడిగాడు.

"ఏముంది, తప్పుచేసిన వారికి కోర్టులో శిక్ష విధిస్తారు ?"

"మన మందరం కలిసి పనిచేస్తుంటే కోర్టెందుకు ?"

"ఇక్కడ అన్యాయమే జరుగుతున్నది. కోర్టే దానిని సరిచేస్తుంది".

"ఓమై బ్రైట్ బాయ్ ! జరిగింది జరిగింది- మనం రాజీకి వద్దాము".

"అది సుందరం ఒప్పుకోంటే.

దటీజ్ నాట్ ఫెయిర్ ? నీకు నేను అపాలజీ-ఇస్తాను - కాని హోప్‌లెస్ గాడికా !"

"వాడికే ; నువ్వొక్కడివి ఇస్తే చాలదు- వీరాసామికూడా ఇవ్వాలి- వాడే దీనికి కారణం".

కొంచెం సేపు తర్జన భర్జనల తరువాత అంగీకారం కుదిరింది- దొర, వీరాసామి క్షమాపణ పత్రాలమీద సంతకాలు చేసి, సుందరంతో చేతులు కలిపారు.

అపుడు గురునాధం పంతులు బెల్గ్రాము మామకు రాసిచ్చాడు, మరునాడు ఉదయమే ఇమ్మని.

"కేసు ఆపుచేయవలసింది- పార్టీలు క్షమాపణలు చెప్పిరాజీ కొచ్చారు"

## 5

ఆకాశమంతా ఒక్కటే మేఘమయి ఉరిమింది.

ఆరోజు మూర్తికి, గురునాధం పండితులుకి డబల్ డ్యూటీ. ఆ రోజులలో వారానికి రెండుసార్లు పన్నెండు గంటల డ్యూటీ చేయవలసి వచ్చేది. వాళ్ళ రాత్రిడ్యూటీకి బయలుదేరేసరికి వర్షం ప్రారంభమయింది; షెడ్డుచేరేసరికి బాగా తడిసిపోయారు. పనివాళ్లు కూడా తడిసిపోయారు. ఎవరేమయినా రైళ్లు నడవాలి. ఒకప్పుడు గుడ్సు ట్రెయినులు నడవక పోయినా ఇబ్బంది లేదు, పాసింజరు రైళ్ళు మాత్రం విధిగా నడవవలసిందే.

మూర్తి పని పంచాడు. పదకొండు గంటల రాత్రికి వెళ్ళవలసిన పాసింజరు ఇంజనుకి చాల మరామ్మత్తులున్నవి. ఇంజను అయిదు నిమిషాలు ఆలస్యమయినా అధికారులు దానిని పెద్ద తప్పుగా పరిగణించి శిక్షవిధిస్తారు. పనికి బయలుదేరవలసిన వేళకే వర్షం మొదలవడం నుంచి సగం మంది, దూరం నుండి రావలసిన పనివాళ్లు హాజరు కాలేదు.

పాసింజరు ఇంజనుకి బరువైన పనులేఉన్నాయి. దాని స్థానంలో మరొక ఇంజను పంపించాలన్నా సిద్ధంగాలేదు. వీరాసామికి తేలికపని ఇచ్చి ముందే పంపించాడు మూర్తి. చివరకు పాసింజరు ఇంజనుమీద పనిచేయడానికి పనివాళ్ళలో సుందరమే మిగిలాడు

సుందరం కేవలం కళాసీ మాత్రమే. వాడు ఫిట్టర్లకు కావలసిన పనిముట్లు పట్టుకొని, వాళ్ళు చెప్పేపని, అంటే బరువులు ఎత్తిపట్టడం, మోయడం తుడవడం వంటి పనులు చేయాలి. వాడు ఉద్యోగంలోచేరి రెండు సంవత్సరాలే అయింది. వాడు చాలమంది సీనియర్ ఫిట్టర్ల పనికూడా చేసేస్థితికి చేరుకున్నాడు. హోప్‌లెస్‌గాడు చేసినపనికి తిరుగులేదు-డ్రైవర్లు వాడు ఇంజనుమీదఉంటే సకాలంలో షెడ్డు విడిచి ఇంజను తీసుకుపోతారు. అందరికీవాడు కావలసినవాడే. ప్రతీ ఒక్క ఉద్యోగి ఏదో ఒక సమయంలో వాడికి సహాయం చేసినవాడే- కొంత మందికి మంచి బుద్ధులు ఒకరునేర్ప నక్కరల్లేదు. హస్యానికికూడా వాడు అబద్ధమాడి ఎరగడు. ఎటువంటి క్లిష్ట పరిస్థితులలోను వెనుకంజ వేయడు. కటువుగా మాట్లాడటం వాడికి తెలియదు. అవమానం భరించవలసిన సమయాలలోకూడా వాడు బయటపడలేదు.

మూర్తి పూర్తిగా హోప్‌లెస్‌మీదే ఆవర్షారాత్రి ఆధారపడవలసి వచ్చింది. పాసింజరు ఇంజనుమీద చాల పనులున్నాయి. కాబట్టి అతనుకూడా ఇంజను వేపే బయలుదేరాడు. ఆ యింజనుకు ఒక పెద్ద చికాకుంది. బాయిలరు నీటితో నింపడానికి రెండువేపులా ఇంజక్టరులుంటాయి. వాటిలో కుడిచేతి వేపుది పనిచేయడం లేదు. దాని భాగాలు ఇత్తడితో తయారవుతాయి. ముందుగా మెషీనుషాపులో దానికోసం భాగాలుతయారు చేయడానికిచ్చి ఆ తరువాతే హోప్‌లెస్ మిగిలిన మరమ్మత్తులమీదికి సర్దుకున్నాడు. ఎడమచేతి వేపు ఇంజక్టరుకూడా అంతబాగా పనిచేయడం లేదు. వాడు ముందు దీనిని బాగుచేశాడు. చాలా బాగా పనిచేస్తున్నది. ఇంతలోమూర్తికూడా వచ్చాడు ప్రతి మరమ్మత్తు దగ్గిరుండి చేయిచాడు. వెళ్ళవలసిన డ్రైవరు చాలా చాదస్తుడు. పదిగంటలకు మెషీన్‌షాపునుండి కొత్తభాగాలు తెచ్చి కుడిచేతివేపు ఇంజక్టరుకు బిగించి టెస్టు చేశారు. చాలా బాగా పనిచేస్తున్నది. ఇంజను అన్ని విధాల పనిచేయడానికి యోగ్యంగాఉంది. డ్రైవరు ఇంకా రాలేదు. వర్షంజోరు హెచ్చింది. కుంభవృష్టి ధారాపాతంగా కురిసే వర్షానికి లోకమంతా జలమయమయింది.

మూర్తి ఇంజనువెళ్లే వరకు హోప్‌లెస్‌ని ఉండమనిచెప్పి తాను ఆఫీసు వేపు నడిచాడు నీళ్లుకారుతున్న బట్టలతో. పది గంటల పదిహేను నిమిషాలు అయింది. డ్రైవరింకా రాలేదు. హోప్‌లెస్ మీదకెక్కి బట్టలార బెట్టుకుంటున్నాడు.

అప్పుడోపని జరిగింది. ఎక్కడినుంచో వీరాసామి ఊడిపడ్డాడు. పనిముట్లు తెచ్చి, కుడిచేతివేపు బిగించిన ఇంజక్టరు భాగాలను, ఇత్తడి వాటిని సులువుగా విప్పేశాడు.

వీరాసామి విప్పుతుంటే హోప్‌లెస్ చూశాడు.

"వెళ్ళవలసిన పాసింజరు బండిఇది. ఇంజక్టరు ఎందుకు విప్పుతున్నావు" ప్రశ్నించాడు వాడు.

" నా బండికి వీటిని తగిలించమన్నారు మూర్తి. దీనికోసం మరోసెట్టు తయారుచేస్తున్నారట. " అన్నాడు వీరాసామి.

హోప్‌లెస్‌కి ఏమీ అర్థమవలేదు.

ఇంతలో డ్రైవరువచ్చాడు. అప్పుడు ఇంజనును టెస్టుచేయడం మొదలు పెట్టాడు. కుడిచేతివేపు ఇంజక్టరు పనిచేయదని, దానిభాగాలను తయారుచేసి తెస్తున్నారని హోప్‌లెస్ చెప్పాడు. పది, పదిహేను నిమిషాలు దొర్లిపోయాయి. డ్రైవర్లు షెడ్డు విడిచే సమయం సమీపించింది. హోప్‌లెస్ మరి ఆలోచించలేదు. పరుగెత్తాడు. ముందుమూర్తితో చెప్పాడు. మూడుఫర్లాంగులు, అరమైలు దూరంలో ఒక కమ్మరి దుకాణం ఊరివేపుంది. అక్కడ దొంగ సామానులు కరిగిస్తారు, కొంటారు.

హోప్‌లెస్ ఆ దుకాణం చేరుకొనేసరికి అప్పుడే ఆ యిత్తడి భాగాలను సమ్మెటతో కొట్టి ముక్కలుచేసి కరిగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీరాసామి జాడ ఎక్కడా కనిపించలేదు.

హోప్‌లెస్ తిరిగి వచ్చేసరికి ఇంజనుదగ్గర చాలా గలాటా జరుగుతున్నది. చాందస్తం డ్రైవరు పెద్దగా అరుస్తున్నాడు. పెద్ద దొరకు టెలిఫోను చేస్తానన్నాడు. చిన్న దొరను పిలుచుకొని వస్తానన్నాడు.

ఈ పరిస్థితిలో గంగన్న అన్న పాతఫిట్టరు ముందుకొచ్చాడు. రెండు నిమిషాలలో అన్నీ సరిచేస్తానన్నాడు. తన పనిముట్ల పెట్టిలో చాలా జాగ్రత్తగా దాచిన ఓవర్‌సైజు భాగాలను, పాతవాటిని తెచ్చి బిగించాడు. దానితో గండం గడిచింది. కాని. ఇంజను పది నిమిషాలు ఆలస్యంగా షెడ్డు విడిచి పెట్టింది.

ఇన్ని జరుగుతున్నా వర్షం మాత్రం కరుణించలేదు. హెచ్చుతునేఉంది. కొండమీదనుంచి జారిన కాలువలు షెడ్డును క్రమంగా ముంచుతున్నాయి.

మూర్తి, పనివాళ్ల ఆఫీసువేపు నడిచారు. అందరి బట్టలు నీటితో బరువెక్కి అడుగులు ముందుకు పడకుండా అడ్డుపడుతున్నాయి.

సూపర్వయిజర్ల గదిలోకి అప్పుడే నీరు ప్రవేశిస్తున్నది. రైలు పట్టాలన్నీ మునిగిపోయాయి. షెడ్డులో ఇంజను కింద భాగాలను మరామ్మతు చేయడానికి పిట్లుంటాయి. అవన్నీ నిండిపోయాయి. పనివాళ్ళు, మూర్తి చలితో గడగడ వణికి పోతున్నారు.

ముందువీరాసామి ఎక్కడున్నాడో తెలుసుకురమ్మని హోప్‌లెస్‌ని పంపించాడుమూర్తి. వాడు చిన్నదొర ఆఫీసులో ఉన్నాడు. అక్కడికి కూడా నీళ్ళు పాకుతున్నాయి. చిన్నదొర కుర్చీమీదనుంచి టేబిలుమీద కెక్కాడు.

అతనికి ఎదురుగా వున్న కర్రపెట్టెమీద వీరాసామి కూచున్నాడు. దొరతో నవ్వుతూ కబుర్లు చెబుతున్నాడు.

వీరాసామి మీద రిపోర్టుచేసినా దొర వినేటట్టు లేదు. పెద్ద దొరతోనే మరునాడు చెప్పాలి, అంతకన్న ముఖ్యం శరీరాన్ని రక్షించుకోడం.-సాయంకాలం షెడ్డులో ఒక ఇంజను ఉంచారు. దానిలో నిప్పు ఆర్పలేదు. జాగ్రత్తగా నీటిలో అడుగులు వేసుకుంటూ, మూర్తి ముందు ఇంజను ఎక్కాడు. అతని వెనుకనే మిగిలిన పనివాళ్లు ఎక్కారు. నిప్పుపెట్టె తలుపు తెరుస్తే లోపల బాగా మండుతున్న మంటల వెలుతురు వాళ్ళ ముఖాలమీద, తడిబట్టల మీద పడింది. ఒకరొకరు బట్టలు పిండుకున్నారు. ఆవేడికి వాటిని ఆర బెట్టుకున్నారు. క్రమంగా ఆవేడికి గుండెల వణుకు తగ్గింది. మూర్తి డ్రైవరు కూర్చుండే బల్లమీద కూర్చున్నాడు. మిగిలిన వాళ్లందరు సర్దుకున్నారు.

పనివాళ్లందరూ ఇంజనుమీదే ఉన్నారు, ఒక్క హోప్‌లెస్ తప్ప. వాడు మాత్రం ఆఫీసుకు సమీపంలో నిలబడ్డాడు. వాడి మీద పడుతున్న వాన ఎనుబోతుమీద పడినట్లు ఏమీ చేయలేక పోతున్నది. అంత తడిసి పోయినా వాడు కొంచెమైనా వణకలేదు. చిన్న దొర కిటికీకి దూరంగా నిలబడి లోపలికి చూస్తున్నాడు. వీరాసామి తమాషా అయిన సంగతులు చెప్తుంటే చిన్న దొర వింటూ నవ్వుతున్నాడు.

హోప్‌లెస్‌కి దూరంనుంచి చీకట్లను చీల్చుకుంటూ టార్చిలైటు వెల్తురు కనిపించింది. లోకమంతా జల ప్రళయంలో మునుగుతుంటే ఇంజన్ల షెడ్డు కొచ్చే పెద్దమనిషి ఎవరని వాడనుకున్నాడు.

ఆ వర్షంలో అర్ధరాత్రి ఇంజన్ల షెడ్డుకి వచ్చిన పెద్దమనిషి వుల్ఫుదొర.

వుల్ఫుదొర ఇనస్పెక్టరుగా పని చేస్తున్నాడు. ఇతను ఆంగ్లోఇండియను. షెడ్డుకు తూర్పువేపు నున్న బంగళాలలో నాలుగోది ఇతనిదే. ఇతని దగ్గిరే నరసింహారావు సాయంకాలం పనిచేస్తుంటాడు. ఇతని బంగళా ఔట్‌హౌస్ లోనే హోప్‌లెస్ గాడుంటున్నాడు.

హోప్‌లెస్ వుల్ఫును చూడగానే "సలాం సాబ్" అన్నాడు. అతను దానిని అందుకొని చిన్నదొర ఆఫీసులోకి ప్రవేశించాడు.

చిన్నదొర వుల్ఫును చూచి లేవనేనా లేవలేదు.

"హలో జో!" అన్నాడు చిన్నదొర వుల్ఫును పలకరిస్తూ—

"హలో మైక్!" అన్నాడు వుల్ఫు.

"ఇంతరాత్రి ఎందుకొచ్చావు?"

"నైట్ ఇనస్పెక్షన్‌కి"

"కిడ్ చేయడం లేదా?"

"నోకిడింగ్! ఇవాళ రాత్రి నైట్ ఇన్స్పెక్షనని ప్రోగ్రాము వేసుకున్నాను. అంతే - లోకాలు మునిగిపోయినా షెడ్యూలు ప్రకారం జరగవలసిందే".

"మంచిది! నీ మానాన్న నువ్వు తిరుగు, నేను నీతో రాలేను."

"సూపర్‌వైజర్లెవరు?"

"మూర్తి, గురు"

"ఎక్కడ వాళ్ళు?"

"వీరా చెప్పరా!"

వీరాసామి నిలబడ్డవాడు గొంతుక సరిచేసుకున్నాడు. వుల్ఫుతో వాడే మాట్లాడాడు".

"గురునాధంగారు ఆఫీసులోనే ఉన్నారు సార్!"

"మంచిది"

"మరి, మూర్తిగారేషెడ్డులో ఇంజనుమీద వెచ్చగా కూర్చున్నారు."

"వాట్?"

"అవునుసార్!"

"మరిస్టాఫ్"

"అదే సార్! అతను సూపర్వయిజరు కదా, ఎక్కడకూర్చున్నా పరవా లేదు. స్టాఫ్‌ని తన దగ్గరే కూర్చోపెట్టుకున్నారు సార్!"

"ఎంత ఘోరం - పనిచేయకుండా స్టాఫ్‌నికూడా అడ్డుతోవ పట్టిస్తున్నాడా?"

"అందుకు సందేహమా సార్?"

వుల్ఫుదొర మరి సహించలేక పోయాడు. మూర్తి కూచున్న ఇంజనువేపు నడిచాడు. వీరాసామి మాత్రం వెళ్ళలేదు అతని వెంట హోప్‌లెస్ మాత్రం వెంబడించాడు.

వుల్ఫు దొర ఇంజనెక్కేసరికి అందరూ కునుకు తున్నారు, అందరి బట్టలు నిప్పు వేడికి ఎండిపోయాయి.

ఇంజనుమీదికెక్కి వుల్ఫుదొర అందరి ముఖాలమీదికి టార్చిలైటువేశాడు. వాళ్లు కళ్లు తెరిచి వుల్ఫుదొరని చూసి భయంతో కంపించిపోయారు.

మూర్తికూడా లేచి నిలబడి ఇనస్పెక్టరు దొరను విష్ చేశాడు.

ఆ దొర దాన్ని అందుకోలేదు.

"మీరంతా ఏం చేస్తున్నారు?"

ఎవరూ జవాబు చెప్పలేదు.

"వర్షంలో అందరం తడిసిపోయాం. పనిచేయడానికి షెట్లు అన్నీ నిండిపోయాయి. అందుచేత ఈ యింజనెక్కి కూర్చున్నాం". అన్నాడుమూర్తి.

"అన్నీ అబద్ధాలు—మీ బట్టలన్నీ పొడిగా ఉన్నాయి—మీరంతా పనెగగొట్టారు. పేర్లు చెప్పండి."

అందరిపేర్లు అతను రాసుకున్నాడు, మూర్తితో సహితం. అతని జాబితాలో మాత్రం వీరాసామిపేరు, హోప్‌లెస్ పేరులేదు.

"మూర్తీ! నువ్వు రెండు పెద్ద నేరాలుచేశావు. వాటిని యజమానులు క్షమించారు, కాని మరచి పోలేదు. ఇది మూడవది. నువ్వు సూపర్వయిజరువు- పనివాళ్ళ నుండి పనిరాబట్టాలి. నువ్వే వాళ్లతో చేతులు కలిపి ఖుషీ చేస్తున్నావు. ఇది మహాపరాధం, యజమానులు యీ నేరాన్ని, ఈ క్రమశిక్షణారాహిత్యాన్ని, ఈ బాధ్యతా దుర్వినియోగాన్ని క్షమించలేరు. మరెక్కడేనా పని వెతుక్కో! ఈమూడో అపరాధంనుండి నిన్నెవరూ రక్షించలేరు."

వుల్ఫుదొర ఇంజను దిగి ఆఫీసు వేపు నడిచాడు.

అంతవరకు వెలుగుతున్న ఎలక్ట్రిక్ దీపాలు ఒక్కసారి ఆరిపోయాయి.

ఆకాశం రెండు ముక్కలయినట్లు మెరుపు కత్తి ఖండించింది. దగ్గిరలోనే పిడుగు పడింది.

## 6

మూర్తి పెట్టె రాట్నంమీద దారం తీస్తున్నాడు. ప్రతి రోజూ ఒక అరగంట ఆపని చేస్తాడు, గాంధీగారి హరిజన్ పత్రిక తెప్పించి చదువుతాడు. మనిషి సన్నంగా కొంచెం పొడుగ్గా ఉంటాడు. దొరలక్రింద ఉద్యోగం చేయడం అతనికి రోజురోజుకి కష్ట మవుతున్నది. కొన్నితప్పులు అతను చేయక పోయినా నింద మాత్రం తప్పడం లేదు.

వర్షం కురిసిన నాటి రాత్రి అతను తప్పేమీ చేయలేదు. కాని పుల్పు దొర తనకు వచ్చిన ఆంగ్ల భాషలో (అందులోని వాక్యాలను చాలా వరకు నరసింహారావు దిద్దాడు), మూర్తి మీద రిపోర్టు చేశాడు. సూపర్వయిజరు కుండవలసిన గుణాలు అతనికి లేవని, అతనిని ఉద్యోగం నుంచి తొలగించడం మంచిదని, అట్లుకానిపక్షంలో యజమానులు దయదలిస్తే అతన్ని పనివాడుగా రివర్టు చేయవలసిందని రాశాడు. రెండు ఘోరమయిన తప్పులను యజమానులు క్షమించారని ఈ మూడోనేరం క్షమించరాదని వ్రాసి దాని అడుగున ఎర్రసిరాతో అండర్‌లైన్ చేశాడు.

మూర్తి దారం తీస్తున్నాడు-ఆదారం ఒకచోట వలంగా. మరొక చోట చాలా సన్నంగావస్తూ, తరుచు తెగిపోతున్నది. దారం తీయడానికి ఏకాగ్రత చాల ముఖ్యమైనది. మనసు అన్యత్రా ఉంటే దారంకూడా తప్పుదారి పడుతుంది. అతను తాను చేసిన తప్పుల గురించి మరోసారి ఆలోచించాడు.

మొదటిసారి అతను చేసిన తప్పు అందరు ఉద్యోగులు చేశారు. మూర్తి ఉద్యోగంలోచేరి ఒక సంవత్సరమయింది. ఒకరోజు పట్ట పగలు అతను డ్యూటీనుంచి ఇంటికొచ్చి భోజనం చేస్తుండే సైరన్లు అరవడం మొదలు పెట్టాయి. విమానాలదాడిని సూచించే సైరన్‌మోత అదేపనిగా వినిపించింది. తొందరగా తిండితిని మంచం కిందికి దూరిపోయాడు. ఇంట్లో అంతమంది అదే పని చేశారు. పక్కవాటాలో వాళ్ళు, ఇంటి యజమానులు అందరూ దాగున్నారు. హార్బరులో బాంబులు పడ్డాయి. విమాన విధ్వంసకాలైన ఫిరంగులు మోగాయి. మొదటిసారి నిజమైన యుద్ధ పరిస్థితులు ముంగిట్లో తారాడాయి.



చాలసేపటి తరువాత ఆల్ క్లియరుసిగ్నలు వచ్చింది. మూర్తి మధ్యాహ్నం ఉద్యోగానికి వెళ్ళలేదు. నగరంలోని వారందరూ భయభ్రాంతులై ప్రాణాలు గుప్పిళ్ళలో పెట్టుకొని ఇళ్లువాకిళ్లువదలి నడవడం మొదలు పెట్టారు. జనప్రవాహం!—మామూలుది కాదది- ఆ మహాభినిష్క్రమణంలో సాగిపోతున్న ప్రవాహమది-వేల కొలది పురుషులు, స్త్రీలు, వృద్ధులు, బాలురు, ఆరోగ్యవంతులు, రోగులు అందరూ ప్రాణాలకు తెగించి ఇళ్ళు వాకిళ్ళు విడిచిపెట్టి ముందుకు నడుస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు మూర్తి, కుటుంబంలోనివారు, పక్కవాటాలోవాళ్ళు ఆలోచించారు ఇల్లు విడవాలా, వద్దా అని, వాళ్ళ కళ్ళ ఎదుటే గట్లు తీసి పారుతున్న వరద గోదావరిలా మనుషులు రోడ్డుమీదకిక్కిరిసి నడుస్తున్నారు. పక్కవాటాలో ఉంటున్న ఇల్లాలు చంటి పిల్లతల్లి, ఆమె కాలికి పెద్ద వ్రణం ఆమె యింట్లోనే నడవలేక పోతున్నది. ఆమె యజమానికూడా రైల్వేలోనే పనిచేస్తున్నాడు. వాళ్ళది రాజమండ్రి ఆమెకు చంటిపిల్ల కాక మరో యిద్దరు పెద్దపిల్లలున్నారు. ఎక్కడికి వెళ్ళాలి, ఏమిటిచేయాలి అన్న ఆలోచనలేకుండా అందరూ ఆజనప్రవాహంలో కలసి పోయారు. కాలి బాధతో ఆ యిల్లాలు ఆ విధంగా నడుస్తునే ఉంది. పుండుకన్న బతుకు ముఖ్యం. బతికుంటే పుండు మానుతుంది. చంటి పిల్లను తండ్రొకసారి. పెద్దపిల్ల లొకసారి ఎత్తుకొనేవారు. వాళ్ల సింహాచలం స్టేషను చేరేసరికి బాగా చీకటి పడింది. ప్లాట్‌ఫారమ్‌మీద తూర్పుకు వెళ్ళే రైలొకటి అప్పుడే వచ్చి నిలబడింది. హొబుహొటోమని అందరూ ఎక్క పోతున్నారు. పక్కవాటావాళ్ళు, మూర్తి, తల్లిదండ్రులు అందరూ అందులోకి పోయారు. ఏర్రాత్రి పన్నెండుకో అది ఆముదాల వలస చేరుకుంది. అక్కడ దిగి ఉదయం బస్సు పట్టుకొని మూర్తి కుటుంబం పక్కవాటావాళ్ళు పల్లె చేరుకునే సరికి పదిగంటలయింది. గడచిన దినం మూడు గంటలకు యిల్లు వదిలిన వాళ్ళు పందొమ్మిది గంటల తరువాత అపాయం నుండి భయం లేని పల్లెటూరు చేరుకొని నిట్టూర్పు విడిచారు.

ఆ వూళ్ళో మూర్తి కుటుంబం, పక్కవాటా వాళ్ళు పదిరోజులపాటు ఉండి పోయారు. సంపన్నులైనమూర్తి తాతగారు అందరినీ ఆదరించి, కాలి మీద రణమున్న యిల్లాలికి కట్లు కట్టించి చాలా సహాయంచేశారు. ఆ పదిరోజులు పల్లెటూళ్ళో మూర్తి చాలా హాయిగా గడిపాడు. ప్రాణంమీది భయంతొలగి, తనవాళ్ళ మధ్య నివసించడంలో అతనికో ఆనందం కలిగింది. దక్షిణం నుంచి వీచే పిల్లగాలులు, పూలతో నిండిన మామిడి తోపులు, చిక్కటి పాలు, తీయటి పెరుగు, రెండేసి కూరలతో భోజనం అతను ఎప్పుడూ మరచి పోలేదు. అతడు ఒక్కటే మరచి పోయాడు. అది తన వుద్యోగం, ఉంటే వుంటుందది. లేకపోతే మరొకటి.

పరిస్థితులు బాగు పడ్డాయి. బతకడానికి ఉద్యోగాలు అవసరం. మూర్తికి ఈ ఉద్యోగం కాకపోతే మరొకటి, కాని, పక్కవాటా అతనికి ఇదే జీవనాధరం. అప్పటికతనికి పదిహేనేళ్ల సర్వీసుంది. అతని బలవంతంతో మూర్తి తిరిగి వుద్యోగానికి వచ్చాడు. అపుడు పెద్ద దొర రెండు చీవాట్లు పెట్టాడు. సూపర్వయిజరు వుద్యోగాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నాడు. పది రోజులు గైరు హాజరయినందుకు మరేమి చర్య తీసుకోలేదు. ఉద్యోగానికి పోని దినాలను సెలవు క్రింద మార్చాడు. కాని, రికార్డులో ఈ విషయం స్పష్టంగా రాశాడు. ఇది ఉద్యోగి చేసిన మొదటి తప్పని కూడా అందులో వుదహరించాడు.

ఇక రెండో తప్పు- యుద్ధం ముదిరిపోయింది. ఏ క్షణమయినా శత్రు విమానాలు దాడిచేసే పరిస్థితులు ఎదురయాయి. ఉద్యోగంలో వున్న రైల్వే వాళ్ళలో యువకుల్ని ఎంపికచేసి ఏ అర్ పి స్క్వాడ్ ఒకటి తయారు చేశారు. వారికి యూనిఫారమ్ యిచ్చారు. హెల్మెట్లిచ్చారు. విమానాల దాడుల నుండి ప్రజలను ఏ విధంగా రక్షించాలో, మంటలనెలా ఆర్పాలో, కూలిన యిండ్లనుండి మనుషులను ఎలా వెలికితీయాలో, ప్రథమ చికిత్స ఏ విధంగా చేయాలో నేర్పించారు. మూర్తి ఒక స్క్వాడ్ లీడరు. అతని కింద పది మంది వాలంటీర్లున్నారు. అందరికీ ఒకనాడు వార్తొకటి చేరింది. ఏ ఆర్ పి లోపని చేస్తున్న వాళ్ళ నందరినీ యుద్ధానికి పిలుస్తున్నారని ఒకే ప్రబుద్ధుడు వార్త లేవనెత్తాడు. ఇంకేముంది ప్రతి ఏ ఆర్ పి వర్కరు యింట్లో ఏడుపులు. మొర్రలు, మూర్తి అసలే గాంధేయవాది, ఖద్దరుధారి, యుద్ధ వ్యతిరేకి- అతను, అతనిక్రింద పనిచేస్తున్న వాలంటీర్లు వార్త తెలిసిన మరునాడే ఒక గుంపుగా పెద్ద దొర ఆఫీసులో ప్రవేశించి, తమ కిచ్చిన యూనిఫారములు, నిప్పునార్పే పంపులు, హెల్మెట్లు అన్నీ తిరిగి యిచ్చి వేశారు. అప్పుడు పెద్ద దొరకు మూర్తిమీద చాలా కోపం వచ్చింది. విమానాల దాడులనుండి రక్షించుకోవడం, ఇతరులను రక్షించడం చాల పవిత్రమైనపని. పనివాళ్ల అంతగా చదువుకున్నవాళ్ల కారు. మూర్తివంటి లీడరు వాళ్ళ భయాలను పారద్రోలి, ప్రజలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత వహించాలి, దీనికి యుద్ధానికి సంబంధం లేదు.

పెద్దదొర అందరికీ నచ్చచెప్పి, తెచ్చిన సామాన్లు పట్టుకు పొమ్మని వాళ్ళని పంపించి వేశాడు. అప్పుడు తనుమూర్తి రికార్డులో ఒక విషయం ఎర్ర సిరాతో రాశాడు.

" ఈ మనిషి ఖద్దరు ధరించడమే కాకుండా, ప్రభుత్వానికి వ్యతిరేకమయిన ప్రచారం చేస్తున్నాడు. అలజడి లేవనెత్తుతున్నాడు. ఇతని ప్రవర్తనలో మార్పు రాకపోతే ఉద్యోగం నుండి తీసి వేయవచ్చు. "

ఈ రెండో తప్పుకు తనెంత వరకు బాధ్యుడు ?

పదిమంది వాలంటిర్లు, వాళ్ళ పెళ్ళాలు ఏడుస్తూ ఇంటిమీద పడితే చేసిన పని ఇది. నిజంగా అతనికి బ్రిటిష్ ప్రభుత్వం మీద గౌరవంలేదు. మరి బాధపడడం దేనికి?

ఇప్పుడు రెండవ ప్రపంచ మహాసంగ్రామం ముగిసి పోయింది. అధికారులు చాలా బలవంతులయారు. తమకు అడ్డుపడిన వారిని సులువుగా తొలగిస్తున్నారు. ఏదో సాకు దొరికితే చాలు. అదే ఆ వర్షం కురిసిన నాటి రాత్రి జరిగింది. మూడో నేరాన్ని తనమీద మోపి, ఎందుకు తనను ఉద్యోగం నుండి తొలగించరాదో వివరించమని చార్జిషీటు ఇచ్చారు అధికారులు.

మూర్తి దీనిగురించి కూడా అంతగా పట్టించుకోలేదు. స్వాతంత్ర్యం కనుచూపు మేరలో ఉందని అంటున్నారు. చార్జిషీటుకు మామూలుగా ఉన్న వున్నట్లు వ్రాసి జవాబిచ్చాడు. అదే మవుతుందని అతను ఆలోచించడంలేదు.

సాయంకాలం నాలుగు గంటలయింది. హాస్పిటలుకు వెళ్ళడానికి మూర్తి రాట్నంనుండి లేచాడు, రెండు రోజుల క్రిందే వీరాసామిని రైల్వే హాస్పిటలునుండి కింగ్ జార్జి హాస్పిటలుకు తరలించారు.

వీరాసామికి దవడ ఎముక విరిగింది. కింద వరుస పళ్లన్నీ ఊడి పోయాయి. కుడిచేయి ఎముక విరిగిపోయింది. తొడ ఎముక విరిగిపోయింది. వర్షం కురిసిననాటి రాత్రి వాడిని ఈస్థితిలో ఊరిలో కమ్మరి దుకాణం ముందు ఎవరోచూసి వెంటనే పోలీసులకు రిపోర్టు చేశారు.

వీరాసామిని పదిరోజులు రైల్వే హాస్పిటలులో ఉంచారు. పరిస్థితి మెరుగు పడక పోతే వాడిని పెద్దాసుపత్రికి తరలించారు. వాడికి తెలివి రావడానికి అయిదు రోజులు పట్టింది. పోలీసులు వీరాసామిని రైల్వే ఆస్పత్రిలో చేర్పడమే కాకుండా కమ్మరి దుకాణం యజమానిని అరెస్టు చేశారు. అతని దుకాణంలో చాలా రైల్వే సామానులు ఇత్తడివి. ముఖ్యంగా ఇంజను భాగాలు దొరి

కాయి. చాలావరకు అతను కరిగించి బిందెలు చేశాడు. వీరాసామి చాలా వరకు ఆ సామాను అమ్మాడని అతను ఒప్పుకున్నాడు. ఈ వ్యవహారంలో ఏదో పేచీవచ్చి కమ్మరి దుకాణం యజమానే వీరాసామిని ఈ విధంగా గాయ పరచాడని రిపోర్టులు తయారు చేశారు.

వర్షం ఆ రాత్రి రెండు గంటల వేళకు తగ్గిపోయింది. షెడ్డులో నీళ్లు మరొక్కగంటలో తీశాయి. వీరాసామి తెల్లారగట్ల నాలుగు గంటలకు బహిర్భూమికి పోయినవాడు తిరిగిరాలేదు. వాడు ఉదయం అయిదు గంటలకి దొరగారి బంగళానుండి టీ, పాలు, బిస్కత్తులు ట్రేలో పట్టుకొని రావాలి. అయిదు అయిదున్నర అయింది. దొరగారు చిందులు తొక్కుతున్నాడు. వాడి జాడలేదు.

హోప్‌లెస్‌గాడు వెళ్ళవలసిన ఇంజనులమీద పనిచేస్తూనే ఉన్నాడు. వాడిలో ఏమీ మార్పులేదు. తెల్లవారుఝామున హెచ్చుయింజన్లు షెడ్డు విడిచి వెళ్లాయి. ఆపని తొందరలో వీరాసామి గురించి ఎవరూ పట్టించుకోలేదు.

వీరాసామి గురించి పగలు తొమ్మిది గంటలకు వార్త తెలిసింది. పోలీసులు ఆ నదికి రంగం మీది కొచ్చారు. వాళ్లు షెడ్డుకొచ్చి వీరాసామి షెడ్డులో ఎంతవరకూ ఉన్నది. ఎప్పుడు విడిచి పెట్టినది మొదలైన వివరాలను సేకరించారు. చిన్నదొరవెళ్ళి హాస్పిటల్ ఎమర్జెన్సీ నెత్తురెక్కిస్తున్న వీరాసామినిచూచి వచ్చాడు. మూర్తి, అతని స్టాఫ్ కూడా వెళ్ళి వచ్చారు. ఎవరికీ ఎవరిని అనుమానించాలో ఎవరిని అనుమానించకూడదో తెలియలేదు.

మూర్తి రోజూ హాస్పిటలుకి వెళ్ళి వస్తున్నాడు. కింగ్‌జార్జి హాస్పిటలులో పెద్ద ఆపరేషనుచేస్తేనే కాని ముఖం తిన్న బడదని, వీరాసామి మాటాడడానికి కూడా వీలుపడదని అన్నారు. వీరాసామికి తెలివి వచ్చింది. బాధకు తట్టుకులేక పోతున్నాడు. తరచు మత్తు ఇంజక్షన్లమీద ఉంచుతున్నారు.

ఆ రాత్రి కుంభ వృష్టి మూలాన్న బొగ్గు కుప్పలవేపు ఎవరూ లేరు. అందరూ షెడ్డులో ఇంజన్లలో తలదాచుకున్నారు. దానికి తోడు కరెంటు పోయినది. మళ్ళా పగలు పదిగంటలకే వచ్చింది. బొగ్గు కుప్పలు గాఢాంధకారంలో మునిగి పోయాయి. వీరాసామి పక్కనే పడిఉన్న బొగ్గుల సంచిలో పోలీసులకు ఇంజను భాగాలు ఇత్తడివి దొరికాయి.

అంతా జరిగిన పదిరోజుల తర్వాత మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సుందరాన్ని నరసింహారావు ఉన్నట్టుండి ప్రశ్న వేశాడు.

"వీరాసామిని కొట్టింది నువ్వేనా? "

" నేనే "

" ఎందుకు కొట్టావు? "

" మూర్తిబాబుగారికి వాడు ద్రోహం చేస్తుంటే పట్టలేక పోయాను".

" మూర్తి బాబుకా ? "

" అవును. వాడు నన్ను విడిచి పెట్టాడు. గురునాథం పంతులు గారిని విడిచి పెట్టాడు. కలలో కూడా ఎవరికీ బాధ కలిగించని శాంతమూర్తి, మూర్తిగారి వెంట పడ్డాడు. "

ఆ రాత్రి ఇనస్పెక్టరు దొరకి వీరాసామికి జరిగిన సంభాషణ వివరంగా చెప్పాడు. -అన్నిటికన్న ముఖ్యమయినది వాడు చేస్తున్న దొంగతనం. చిన్న దొర అండ చూసుకొని వాడు హీనంగా ప్రవర్తిస్తున్నాడు.

" నువ్వు చేసిన పని తప్పు కాదా?"

" నాకు తప్పనిపించలేదు. "

" నువ్వు వీరాసామిని కొట్టావు. వాడు హాస్పిటలు పాలయాడు. వాడి కుటుంబం నడివీధిని పడ్డది. దీనికి ఎవరు బాధ్యులు? "

సుందరం ఒక్క క్షణం ఊరు కొని మళ్ళా అన్నాడు.

## మృత్యుంజయుడు

["జిడ్డు కృష్ణమూర్తి" మరణవార్త విని]

ఫస్ట్ స్టెప్ ఈజ్ లాస్ట్ స్టెప్.
జీవన మృత్యువులు పెనవేసుకొని ఏకమైన నీకు
వేరే మృత్యువెక్కడ కృష్ణమూర్తీ!
నీ నిమీలిత ప్రశాంత నేత్రాల వెనుక
విస్తరించిన అనంత శూన్యంలో
ఏ అనుబంధాల సాలెగూళ్ళకూ ఆధారం లేదు
సముద్రపు ఒడ్డున ఏ అడుగు జాడలూ మిగలవు
కోల్పోతానేమోనని భయపడడానికి
ఏం మిగుల్తుంది చిల్లు జేబులో?
ఎగిరిపోతున్న పక్షుల్ని రెక్కలు కత్తిరించి
భద్రంగా దాచుకొని ఆడుకొనే స్వభావం లేని నీవు,
దిగంతాలకి ఎగిరిపోతున్న రంగుల పక్షుల్ని ఎగిరిపోనిస్తావు
గడచిపోతున్న కాలాన్ని గడచిపోనిస్తావు
పలకమీది అక్షరాల్ని ఎప్పటికప్పుడు చెరిపేస్తావు
నీ బ్యాంక్ ఎకౌంట్ నిల్లు.
శూన్య దిగంతాన్ని కప్పుకొని అగాధ ఏకాంత సముద్రంలోకి దూకే
సన్యాసుఁడివి నువ్వు
ఏ తోడూలేని ఒంటరి యింట్లో, నీకే దిగులూ స్ఫురించదు.
నీ ఇంట్లో అరలు లేవు. నీ యింటికి పైకప్పు లేదు.
ఆకాశం నీయిల్లు అనుభూతి నీ ఆస్తి
జీవితానికి లాగే ప్రతినిత్యం
గుడ్ మోర్నింగ్ చెప్తావు మృత్యువుకికూడ
శీతోష్ణాల్లనుండి, ఎండ వానల నుండి,
ఏ ఆచ్ఛాదనం లేని అటవీ విటపానివి నువ్వు
హిమబిందు స్పర్శనుండి తలదాచుకోని
గులాబీ పువ్వువి నువ్వు
ఏటిమీది నురగలా ప్రతిక్షణం నవ్యం నీ నవ్వు
సాఫీగా సాగిపోయే సెలయేరువి నువ్వు
అగాధ అనంత శూన్య సముద్రం ముందు నిలబడి
అస్తిత్వాన్ని కోల్పోతాననే భయంలేని నది,
ఒక్క అడుగు ముందుకువేసి
ఆకృతినే కోల్పోతే సంతాపా లెందుకు?

శ్రీ రాణి శివశంకరశర్మ

" వాడు దొంగ సొమ్ముతెస్తుంటే ఇంటి వాళ్ళెవరూ అటంక పరచలేదు. వాడిని మంచి దారికి తేలేదు. పైగా ఇంకా దొంగతనాలు చేయడానికి ప్రోత్సాహమిచ్చారు. వాడు దొంగ సామానమ్మి డబ్బుతెస్తుంటే వాడి సారా కోటా హెచ్చు చేశారు. వాడు చేసిన దొంగతనాల వల్ల ప్రభుత్వం నష్టపోతున్నది. మా వంటి తోటి పనివాళ్ళు, మూర్తి వంటి సూపర్వయిజర్లు మసి అయి పోతున్నారు. "

" ఈ ధర్మరక్షణ నువ్వే చేయాలా?"

" ఎవరూలేని వాడిని - నేను చేస్తే మంచిది. "

నరసింహారావు మరి మాట్లాడలేదు. తానొక్కడి నున్నా నన్న నంగతి వాడు మరచాడా అని సందేహించాడు.

## 7

సింహాచలం పరిస్థితులన్నీ మారిపోయాయి.

ఇప్పుడామె బొగ్గులు మొయ్యడం లేదు. ఆ రాత్రి సుందరాన్ని కౌగిలించుకున్న క్షణం నుంచీ ఆమె మారిపోయింది. సుందరం ఒంటి మీది దెబ్బలని తలచుకొని రెండు రోజులు ఏడ్చింది. సుందరం దొరమనిషని, దూరంగా ఉంటే ఎంతో బాధపడింది. తను ఇప్పటికీ దొర మనిషే.

సింహాచలం బంగారం వంటిది! బంగారు గని కూడా. బంగారం తీసే నేర్పు ఆమె తమ్ముడికి తెలుసు. ఆ రోజులలో షెడ్డులో చాలా ఖాళీలు వచ్చాయి. వాటిని పెద్ద దొరే నింపేవాడు. పెద్ద దొరకి చిన్న దొరకి మంచి దోస్తీ. ఇద్దరూ రాత్రిళ్ళు లాన్‌లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటారు. ఇంగ్లాండు దేశాన్ని జ్ఞాపకం చేసుకుంటూ బుర్లు బుర్లు ఖాళీ చేస్తారు. నేటివులకు కల స్వామి భక్తిని వారు ఎప్పుడూ శంకించేవారు. నేటి బానిస రేపటి శత్రువు. వాడు సమయం చూచి వెన్నుపోటు పొడుస్తాడు. వాడిని బానిసగానే ఉంచాలి.

బానిసలలో కూడా తెలివైనవాళ్ళు, దేశ భక్తులు ఉన్నారని వాళ్ళకు తెలుసు. వాళ్ళని ప్రత్యేక దృష్టితో పరీక్షించి సమయం దొరికినప్పుడు పాతాళానికి తొక్కేయాలి.

వాళ్ళు ఎవరినీ నమ్మరు. యూరేషియన్లమని చెప్పుకుంటూ తమకు వారసులైన నల్లదొరలనికూడా వాళ్ళు అంతంత మాత్రంగా చూస్తారు. ఈ దేశమొక ఆట వస్తువు.

ప్రపంచ మహాయుద్ధంలో చాల దెబ్బలు తిన్నారు వాళ్ళు. భారతదేశం రోజు రోజుకు చేయి జారిపోతున్నది. ఈ నంగతి కూడా వాళ్ళకు తెలుసు. అందుకోసమే ఇంగ్లాండు దేశం, పల్లెల సౌందర్యం, మనుషుల ఋజువర్తన మొదలైన గొప్ప సంగతులు మననం చేసుకుంటుంటారు.

సింహాచలం తమ్ముడు చాల ప్రయోజకుడు. వాడు సింహాచలం వేయించిన మొదట కళాసీ- వాడి పెళ్ళాం వాడిని విడిచిపెట్టి వెళ్ళింది. ఆడారి మొగుడని. మొగుడిని వదిలిపెట్టి ఇల్లు పట్టిన ఆడపడుచుని, నిత్యం సాధించుకుతినే అత్తగారిని విడిచిపెట్టి మరో మంచి మనిషితో వెళ్ళిపోయింది.

సింహాచలంతో కలియాలని చిన్నదొర తహతహ లాడిపోతున్నాడు. రోజూ దాని తమ్ముడిని పిలిచి యోగక్షేమాలు కనుక్కుంటాడు. వారం రోజులు తిరక్కముందే ఇద్దరు సింహాచలం మనుష్యులకు ఉద్యోగాలు వేసి, సింహాచలాన్ని తిన్నగా బంగళాకే తెప్పించుకున్నాడు.

ఆ రోజు నుంచీ సింహాచలం తమ్ముడు చాల గొప్పవాడయ్యాడు. ప్రతీ కళాసీ ఉద్యోగానికి మూడువందల రూపాయలు పుచ్చుకునేవాడు. రెండు వందల రూపాయలు వాడివి. ఒక వంద దొరకిచ్చే విస్కీ బుడ్లకో, బ్రాందీ బుడ్లకో, కోళ్ళకో ఖర్చుపెట్టేవాడు.

షెడ్డులో పనివాళ్ళకి సింహాచలం పాట, ఆట కరువైపోయాయి.

అందరూ అన్ని విధాల అనుకుంటారు. ఎవ్వరూ సింహాచలం ఏమనుకుంటుందోనని అయినా ఆలోచించరు. సింహాచలం ఒక్కర్తే అంత బంగళాలోను ఒకప్పుడుంటుంది. దొర డ్యూటీలో ఉన్నప్పుడు, పెద్ద దొరతో మాట్లాడడానికి వెళ్ళిపోయినప్పుడు ఒంటరిగా గదిలో కూర్చొని ఆలోచిస్తుంది. తాను చిలకలా ఉండడం నిజమే- పంజరంలో ఉండే చిలక అయినందుకు విచారిస్తుంది. తన అందమేమో తనకు తెలియదు. దొర తప్పతాగి వెర్రిగా తనవేపు చూస్తుంటే చాల బాధపడుతుంది. తన బతుకుని తమ సుఖానికి, తమ ఆర్జనకి విలియా వేసిన తమ్ముడి మీద, తల్లి మీద విరుచుకుపడుతుంది. వాళ్ళు నయాన్న భయాన్న పయసులోనున్న దానిని దొర ఇంటికి దిగబెడితే తలమోదుకొని ఏడ్చింది.

దొర ఇంట్లో సింహాచలానికి లోటేమిటి లేదు- కుసిసీవోడు మూడు పూటల వండి పెడతాడు. దొర మంచి చీరలు కొనిపెట్టాడు. తమ్ముడిన్ని ఊళ్ళో వాళ్ళందరూ దొర బావమరిది అని పిలిస్తే వాడు నంబరపడి పోతున్నాడు.

తల్లిముండాకూడా కూతురు మాత్రం తనపని తాను మానలేదు- మామూలుగా బొగ్గులు మోస్తునే ఉంది. చిన్నదొర అల్లుడవడం నుంచి ఆమెను ఎవరూ అడ్డుపెట్టరు- బొగ్గుఅమ్మిన డబ్బులు వడ్డీలకు తిప్పుతుంది. సింహాచలం తమ్ముడుకూడా అదే వృత్తి చేస్తున్నాడు- వడ్డీలకు వడ్డీలు- చేతినిండా డబ్బు ఇల్లు బాగుచేయించాడు. పాకతీయించి పెంకుటిల్లు కట్టాడు. మంచి మంచి బట్టలు వేసుకుంటాడు రిక్షాలో సినిమాకి పోతాడు- ఇవన్నీ సింహాచలం చేతి చలవని వాళ్ళకి తెలుసు. దీపం బాగా వెలుగుతున్నది. వాళ్ళన్నీ చక్కబెట్టుకుంటున్నారు.

ఈ మధ్య దొర విపరీతంగా తాగుతున్నాడు. అప్పుడప్పుడు సింహాచలాన్ని ఇంగ్లాండు వస్తావా అని అడుగుతున్నాడు- మనిద్దరం బెంగుళూరు పోదామా అని మరోసారి అంటాడు. దొరకి సింహాచలం అంటే చాల గౌరవం ఆమె వల్లనే విస్కీ బ్రాందీలు ఇంట్లో కాలువలై పారుతున్నాయి. కోళ్ళు దొరుకుతున్నాయి. పళ్ళకు అంతేలేదు. వచ్చిన జీతమంతా బాంకులో జమ అవుతున్నది. ఎవరైనా ఆడదాని షోకు మరిగితే డబ్బు కర్పూరంలా హరించుకు పోతుంది. అతని విషయంలో సింహాచలం కల్ప వృక్షమే.

వీళ్ళెవరికి సింహాచలం మనసులో ఏముందో అక్కరలేదు. సింహాచలం ఒంటరిగా ఉన్నప్పుడు కిటికీకి ఎదురుగా కుర్చీ మీద కూర్చుంటుంది. ఆకాశం మీద ఎగిరే పక్షుల్ని చూస్తుంది. తన పెరటిలో సంపెంగ చెట్టు జ్ఞాపకం వస్తుంది. ఆ చెట్టుని ఎవరో మాదవదార పువ్వుల మనిషికి తమ్ముడు కౌలుకిచ్చాడని తెలిసి ఎంతో బాధపడింది. రాత్రిపూట ఫ్లడ్‌లైట్ల వెలుతురులో చీర ఎగగట్టి, పయ్యెద వెనక్కు దోపుకొని చందమామ పదాలు చెలికత్తెలతో పాడుతూ, పాటకు అనుగుణంగా అడుగులు వేస్తూ, అభినయిస్తూ స్వేచ్ఛగా నవ్వుతూ బ్రతికిన దినాలు జ్ఞాపకం తెచ్చుకుంటుంది.

ఇంకా ఇంకా ఆలోచనలను వెనక్కు మళ్ళిస్తుంది. ఇంజన్ల షెడ్డులో అటువంటి మనిషుంటాడని సింహాచలం కలలోకూడా అనుకోలేదు- హోప్‌లెస్ గాడిని నాలుగేళ్ళ క్రింద మొదటిసారి చూసినపుడు ఆమె మనసు అదోవిధంగా అయిపోయింది. వాడి గురించి చాల విషయాలు వింది. వాడి నడక, వాడి ఛాతీ, వాడి నవ్వుతున్న ముఖం, వాడి మాటలలో మగతనం చూచి పొంగిపోతుంది. వాడికి ఆమెకు వయసులో అయిదేళ్ళ తేడా. వాడు కాంటీనులో పనిచేస్తున్నప్పుడు ఎవళ్ళులేకుండా చూసి పనికట్టుకొని వెళ్ళి మాట్లాడేది- వాడికి తగని సిగ్గు- వాడి సాహసకార్యాలు ఒకటీ ఒకటీ విని, మనసంతా వాడే నిండి వాడి కౌగిలికోసం ఎదురు చూచేది. అందుకోసమే వీరాసామి తన మీద పందెం కాసినా అభ్యంతరం తెలపకుండా నవ్వేసి ఊరుకుంది. మొదటి నాలుగు రోజులు అందరి మగాళ్ళ మధ్య సింహంలా నిలుచున్నవాడు ముందుకొస్తాడేమోనని ఎదురు చూచింది. ఎవరూ కాలు కదపక తిరిగి వెళ్ళిపోతుంటే, తాను హోప్‌లెస్‌గాడి గురించి విన్నదంతా తప్పేమోననుకుంది.

కాని, అయిదోరోజు వాడు ముందుకొచ్చి, అందరి మధ్య నిర్భయంగా తనని కౌగలించుకున్నప్పుడు ఒళ్ళు దాచుకోలేక పోయింది. వాడి కౌగిలిలో, కాదు కాదు తన కౌగిలిలో వాడు జారిపోతాడని శంకించి, వాడి పెదవులను తన పెదవులతో బంధించింది. వాడిలో ఏవిధమైన ఉద్రేకం లేకపోతే కష్టించి నవ్వించింది. చుట్టూ అంతమంది చూస్తున్నారని, సిగ్గుచేటని కూడా ఆలోచించకుండా తనువు మనసు వాడికి సమర్పించుకుంది.

వాడిని కుంటి దొర ఎన్నెన్ని దెబ్బలు కొట్టాడు- ఆ దెబ్బలేవీ వాడి శరీరం మీద పడలేదు. తన మృదునైన చర్మాన్ని వొలుస్తున్నట్లు అనుకుంది. ఆ రోజుతో కుంటిదొర పొందు తెంపుకు పోదామనుకుంది. కాని ఏం ప్రయోజనం? అరదై పుట్టడంకంటె ...

రోజులు గడుస్తున్నాయి. మూర్తి మీద ఛార్జి షీటు తయారు చేశారు. దానికి ఆధారం పుల్పు దొర రిపోర్టు- అదికాకుండా మూడుసంవత్సరాలయి అతని కాన్ఫిడెన్షియల్ రిపోర్టులన్నీ బాగులేవు- పెద్దదొర అవి రాసేముందు చిన్నదొరని పిలిచి అడగడం, అతను విధిగా చెడ్డ చెప్పడం, పెద్దదొర రిపోర్టును పాడుచేయడం జరుగుతున్నది. ఈ విధంగా ఉద్యోగానికి వచ్చిన దగ్గిర నుండి మూర్తి గురించిన చెడ్డ రిపోర్టుల నన్నిటిని క్రమబద్ధం చేసి చాల బలమయిన ఛార్జి షీటు తయారు చేశారు.

మూర్తి ఛార్జి షీటుకు జవాబిచ్చాడు. దానికి యజమానులు సంతృప్తులు కాలేదు. ఆ విషయం తెలియపరుస్తూ అతనిని ఉద్యోగం నుండి తొలగించే ముందర చివరి ఎంక్వయిరీ చేయడానికి ఒక ఆఫీసరును నియమించారు. ఏదో గోటితో చిక్కవలసిన దానిని గొడ్డళ్ళతో చీల్చడానికి దొరలు సిద్ధపడ్డారు.

మూర్తిలో మాత్రం ఏ విధమైన మార్పు రాలేదు. అతను ఇంత జరుగుతున్నా కొంచెమైనా భయపడలేదు. తను, తన రాట్నం, తన ఖద్దరు, తన ఉద్యోగం అంతా మార్పులేకుండా చేస్తున్నాడు. వీరాసామిని విధిగా వారానికి రెండుసార్లు చూసి వచ్చేవాడు. అతని వెంట ఎప్పుడూ సుందరం ఉండేవాడు. వీరాసామి మాట్లాడడానికి ప్రయత్నించాడు. క్రింది దవడ చాల శ్రమతో కదప గలిగేవాడు. ప్రాణభయం తప్పింది. కాని వాడి ముఖం మాత్రం కొంచెం వికృతంగా మారక తప్పలేదు.

గురునాథం పంతులు ఇప్పుడు విజయనగరం వెళ్ళడం లేదు. ఆమనిషి నెవతెనో విశాఖపట్నం తీసుకొచ్చి తన యింట్లోనే ఉంచుకున్నాడు. తల్లి వేరే వండుకు తింటుంది. అతనికి, అతని మనిషికి హోటలు నించి కారియరు వచ్చేది. అతను మూర్తి మీద జరుగుతున్న అత్యాచారానికి చాల మథన పడ్డాడు. నరసింహారావుతో కలిసి ఆలోచించాడు. కోర్టులో కేసు పడేసి స్టే ఆర్డరు తెప్పిస్తానన్నాడు. కాని ఏ విధమైన చర్య తీసుకోడానికి మూర్తి అంగీకరించలేదు. కోర్టులకు వెళ్ళి డబ్బు వ్యయం చేయడం, న్యాయాన్ని డబ్బిచ్చి కొనుక్కోవడం అతనికి నచ్చని పనులు. అతని నిర్ణయాన్ని వాళ్ళిద్దరూ ఎంత ప్రయత్నం చేసినా మార్చలేకపోయారు.

సుందరం వారానికి రెండుసార్లు మూర్తిగారితోను, రెండుసార్లు గురునాథంగారితోను, రెండుసార్లు నరసింహారావుగారితోను వీరాసామిని చూడడానికి వెళ్ళడమేకాకుండా ఆదివారం నాడు తానొక్కడు స్వయంగా వెళ్ళేవాడు. వీరాసామికి తొలి దినాలలో సుందరాన్ని చూచినప్పుడు వణుకు వచ్చి, రాత్రికి విధిగా జ్వరం వచ్చేది. వీరాసామి ఇంకా మరచిపోలేదు. వర్షం కురిసిన నాటి రాత్రి తెల్లవారుఝామున నాలుగుగంటల వేళ తను బొగ్గు లేరుకోడానికి సంచి పట్టుకు బయలుదేరాడు. దానిలో చీకట్లో విప్పిన రెండింజనుల ఇత్తడి భాగాలున్నాయి. వాటిమీద పేరుకు నాలుగు బొగ్గు ముక్కలు వేసుకొని కమ్మరి దుకాణానికి పోదామనుకున్నాడు. ఇంజను నుండి ఇత్తడి భాగాలు విప్పుతున్నప్పుడు ఎవరో వెనుక తచ్చాడుతున్నట్లు వాడికి అనుమానమే. అయినా చిన్నదొర మనిషిని ఎవరూ ఏమీ చేయలేరని వాడి ధైర్యం.


## గెలవండి రూ. 125000 విలువ గల బహుమతులు.

| | | |
|---|---|---|
| 14 | 19 | 12 |
| 13 | 15 | 17 |
| 18 | 11 | 16 |

ఎంట్రీ రుసుము లేదు.

మొదటి బహుమతి: రాజ్‌దూత్ మోటారు సైకిల్ లేదా రు. 10000 నగదు

కన్సొలేషన్ బహుమతి: అధునాతన ఇంపోర్టెడ్ జపాన్ మోడల్ టూ_ఇన్_వన్ రు. 240/_ లకే మా చెయిన్‌లింక్ స్కీము ద్వారా పొందవచ్చును. 10 నుండి 18 వరకు గల అంకెలు వుపయోగించి

| | | |
|---|---|---|
| 13 | | |
| | 14 | |
| | | 15 |

అడ్డంగా / నిలువుగా / మూలగా, ఎటు కూడినా మొత్తం 42 వచ్చేటట్లు గళ్లు నింపండి.

ఒక అంకె ఒకసారి మాత్రమే వాడాలి. మీ ఎంట్రీలు 15 రోజులలోగా పంపండి.

**GOOD LUCK Co. (WKH)**

**136, New Layalpur, Delhi-51**

ఆ ధైర్యం పటాపంచలయింది ఒక్కసారి. కారుచీకట్లో ఒక్కసారి మెరిసినట్లయింది. దవడ మీద మొదటి దెబ్బ తగలగానే - పళ్ళూడి పోయాయి- నెత్తురు కారిపోతున్నది - ఏదో బాధ- కేక వేయడానికి దవడ కదలదు-రెండో దెబ్బ చేతిమీద, మూడవది తగిలేసరికి స్పృహ పోయింది. వీరాసామికి వాటిని తలుచుకుంటే నాడి ఆగిపోతుంది.

సుందరం చాల సహాయం చేస్తున్నాడని వీరాసామి భార్య చెప్పింది. క్రమంగా వాడిమీద కోపం తగ్గింది, భయం పోయింది. వాడేదో రహస్యాన్ని చెప్పడానికి వస్తున్నట్లు వీరాసామికి అనుమానం కలిగింది. మహాపరాధం చేసిన మనిషి పశ్చాత్తాపాగ్నితో దహింపబడుతున్నట్లు, మహాపాతకాలు చేసినవాడు గంగలో మునిగి ప్రాణత్యాగం చేయదలచినట్లు వీరాసామికి అనిపించింది.

రెండు మూడురోజులలో వీరాసామిని విడిచి పెడతామని డాక్టర్లన్నారు. ఆ ఆదివారం ఎవరూ వీరాసామి దగ్గర లేరు. గొంతుక బొంగురుపోయి, మాట తిన్నగారాక, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ సుందరం వీరాసామి చేతులు పట్టుకున్నాడు.

"వీరాసామి ! నువ్వు మూర్తిగారికి అన్యాయం చేస్తున్న సంగతి తెలుసు కాని నేను కోపం పట్టలేక నిన్ను కొట్టాను. ఈ పాపం దాచుకున్న కొద్ది నాకు నిద్రాహారాలు దూరమవుతున్నాయి. నేను చేసిన నేరాన్ని ఒప్పుకుంటున్నాను. నన్ను కోర్టుకీడ్చి శిక్ష వేయించు నేను బాగుపడతాను".

వీరాసామి సుందరం ముఖంలోకి చాలసేపు చూశాడు.

"ఓరి ఓవ్‌లెస్నూ ! నీ తండ్రెవడో, తల్లెవరో తెలీదు- జాతేదో తెలీదు- మతమేదో ఎరగం- కాని, నీకున్న నీతి మాకెవరికుందిరా ! నేను మంచి గౌరవమైన కుటుంబానికి చెందిన వాడిని- నాకేం డబ్బుకు లోటా- కాని నీతి మాలి దొరల చెప్పులు నాకి బతికానురా ! మీరంతా నన్ను చూడడానికి వచ్చారుగాని, ఒకరోజైనా ఆ చిన్నదొర వచ్చేడ్రా! నేను అతనికి ఆడవాళ్ళను తార్చాను, బుడ్లు పట్టుకొచ్చి చేతుల్లో పెట్టాను. అవుసరం ఉన్నంత సేపు మాట్లాడేవాడు - వాడిదయ సంపాదించడం కోసం అందరి మీదా నేరాలు కల్పించి చెప్పాను. ఇవన్నీ హద్దులు మీరిపోయాయి- నువ్వు శిక్షించినది ఇంకా చాలదు. నా పాపం జన్మలకుగాని విడిచిపెట్టదు-" అన్నాడు వీరాసామి కళ్ళ నీళ్ళు కారుతుంటే.

"వీరాసామీ ! నేనెంత నీతి మంతుడనయినా న్యాయం సమకూర్చే అధికారం నాకేదీ ? ప్రభుత్వం వారు శిక్షిస్తారు- లేకపోతే దేవుడు చేయవలనది చేస్తాడు, నేను చేసిన పని క్షమించరానిది. నా వాఙ్మూలం ఇస్తాను-కేసు వెయ్యి వీరాసామీ !"

వీరాసామి కళ్లు తుడుచుకున్నాడు.

"అంతకన్న గొప్ప పని మరేదేనా లేదా ?"

"అదే న్యాయ సమ్మతమైనది."

"న్యాయం విడిచిపెట్టు - నిన్ను క్షమించానని అంటే నా మనసు సంతోషిస్తుందిరా ఓవ్‌లెస్."

వీరాసామి లేచి సుందరాన్ని గుండెలకు హత్తుకున్నాడు; ఆనందాశ్రువులు కారుతుంటే.

## 8

వెళ్ళబోయే మెయిలింజను ఎండలో తళతళ మంటున్నది.

ఆ రోజుల్లో స్టీము ఇంజనులే మెయిలు ట్రెయినులు పనిచేసేవి. బ్రిటిష్ శాస్త్రజ్ఞులు కనుక్కొని, మేలురకం ఇంజనులను తయారు చేసి భారతదేశానికి దిగుమతి చేశారు. ఈ ఇంజనులు వారి సాంకేతిక నైపుణ్యానికి ప్రతీకలు. ఎక్కడయినా బ్రిటిషువారు అశ్రద్ధ ప్రదర్శించవచ్చుగాని, తాము తయారు చేసిన యంత్రాల విషయంలో అశ్రద్ధ వహించరు. చిన్నదొరకూడా అటు వంటివాడే. మెయిలింజను భాగాలలో కొన్ని ఇత్తడి భాగాలను తోమి, కొన్నింటికి నల్లరంగు వేసి, కొన్ని స్టీలు భాగాలను మెరుగుపెట్టి యింజను నిగనిగ లాడేటట్టు తయారు చేశారు, భారతదేశంలో అన్నింటికన్న చవక యినది శరీర శ్రమ. దానిని వినియోగించడం బ్రిటిష్‌వారికి బాగాతెలుసు. దొరల మెప్పులకోసం మితిమీరి శ్రమపడినవారు చాలమంది ఉన్నారు. అటు వంటివారి మీద ప్రభువుల దయ నిలుస్తుంది. దొరల బంగళాలలో పెరిగే కుక్కల తరువాత ఇటువంటి విశ్వాస పాత్రులమీద వారి అనుకంప అంతంత మాత్రం కనిస్తుంది.

అసిస్టెంటు ఫోర్మన్ బట్లరు దొర స్వయంగా మెయిలింజను దగ్గిర నిలబడి పనులు చేయిస్తున్నా, అతని అత్తగారు, అంచే సింహాచలం తల్లి మాత్రం కాలిన బొగ్గులు ఇంజను దగ్గిరే ఏరుతున్నది. సింహాచలం మోజులో దొర ఉన్నన్నాళ్ళు ఎవరూ ఆ జరతను ఆపలేరు. ఎంత తాగినా తీరనిది ధన దాహం. రోజుకో పదిరూపాయలు బొగ్గులమ్మి సంపాదించి దానిని వడ్డీకిచ్చి, వచ్చిన వడ్డీ మళ్ళా తిప్పి ఆ ముసలిది మరీ తాపత్రయపడుతున్నది. సింహాచలాన్ని ఉంచుకున్నందుకు చిన్నదొర నెలకు యాభై రూపాయలు ముసిలిదానికిస్తాడు. సింహాచలం తమ్ముడు ఉద్యోగం చేసి డబ్బు సంపాదించడం ఉండనే ఉంది. ఉద్యోగాలు వేయించి, డబ్బు వడ్డీకిచ్చి, తనయిల్లు బాగు చేసుకుంటున్నాడు. కాని, ఇద్దరికిద్దరూ సింహాచలం సంగతి పట్టించుకున్న వాళ్ళుకాదు.

రైలు పట్టీలకు మధ్య కొంత పచ్చి బొగ్గు పడివుంది. క్రమంగా సింహాచలం తల్లి ఆ కుప్పదగ్గరికి చేరుకుంది. బొగ్గులతట్ట ఒకటి నింపి దూరంగా పెట్టుకోడానికి వెళ్ళిపోంది. ముసిలి దానికి చూపు ఒక మాదిరిగా ఉన్నా చెవుడు మాత్రం బ్రహ్మాండంగా ఉంది. మెరుస్తున్న ఇంజను మీద ఎక్కిన వాడు అబ్రహాము డ్రైవరు. ఇతను ఆంగ్లేయుడుకాదు. కాని యురేషియనునని చెప్పుకుంటాడు. దొరల తెలుపు అంటక పోయినా తల్లి నలుపు మాత్రం ఇతనిని విడిచిపెట్టలేదు. రంగెలా ఉన్నా వేష భాషల్లో వాళ్ళనోటి నుండి ఊడిపడ్డవాడే. అంబలిలో పోషక పదార్థాలున్నాయని, తల్లిముంత చీరలే కడుతుందని అందరితో చెప్తాడు. ఇతనికి చాలమంది పిల్లలు- మనిషి పుష్టిగా తింటాడు. శ్రమపడి మీది కొచ్చాడు. మైలు నడిపాడంటే గాలిలో ఎగిరి పోతున్నట్లే ఉంటుంది. రెండుగంటల లేటుగా బయలుదేరినా సకాలంలో రైలును గమ్యం చేర్చగలడు. అతనెప్పుడూ అరగంట ముందుగానే డ్యూటీకి వస్తాడు. ఇవాళ మాత్రం ఏదో చికాకువచ్చి సరిగా బయలుదేరవలసిన సమయానికివచ్చి, తొందరతొందరగా ఇంజనెక్కి అన్నీ ఒకసారి చూచుకున్నాడు.

"జిమ్ ! హరియప్ ! యూ ఆర్ ఆల్‌రడీ లేట్" క్రిందను నిలబడ్డ సొట్టదొర అరిచాడు.

డ్రైవరు అబ్రహము విజిల్‌కొట్టి తనవేపునుండి రైలు పట్టీలను చూచుకొని ఇంజను నడిపించాడు. మరో కాళీతట్ట పట్టుకొని పరుగెత్తి వస్తున్న సింహాచలం తల్లికి ఏవీ వినిపించలేదు; కదులుతున్న ఇంజను కనిపించలేదు - పచ్చి బొగ్గులు - తట్ట రూపాయి - ఆ పచ్చి బొగ్గులు మాత్రమే కనిపిస్తున్నాయి - ముసిలిది పట్టీలమధ్యకు పరుగున రావడమేమిటి, ఇంజను కదిలి ముందుకు పోవడమేమిటి - అన్నీ రెప్పపాటు కాలంలో జరిగిపోయాయి. పనివాళ్ళ హాహాకారాలు మిన్నుముట్టాయి. అబ్రహాం దొర ఎమర్జన్సీ బ్రేకు వేసినా ఇంజను వెంటనే ఆగలేదు - ముసిలిదాని శరీరం మీదనుండి ముందుచక్రాలు వెళ్ళినతరువాత ఆగిపోయింది.

లోకాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంతో ఏలుదామనుకున్న సింహాచలం తల్లి రెండుగా తెగి ఇంజనుక్రింద ఉండిపోయింది.

మనుషులు కొంతమంది చచ్చినా తగాదాలే తెచ్చిపెడతారు. మదరాసు నుండి కలకత్తా పోవలసిన మెయిలువచ్చి ప్లాట్‌ఫారము మీద సిద్ధంగా ఉంది. ఇంజనువెళ్ళి తగలవలసినది ఎటూ కదలలేని స్థితిలో ఉండిపోయింది. ఆ ఇంజను ఒక్క అంగుళముకూడా కదలడానికి వీలులేదు - పోలీసులు, రైల్వే

అధికారులు అందరూవచ్చి పరీక్షచేసి అనుమతించే వరకు అదికదలడానికి వీలులేదు. డ్రైవరు అబ్రిహాం కూడా కదలడానికి వీలులేదు.

వంక్యావాలిటీ వీక్ మొదటిరోజు ఆ విధంగా ధ్వంసమయింది. మొదటి రోజునే సంధి కొట్టేసింది. పేరు సంపాదించుకోవాలన్న సొట్టదొరకు రెండవ కాలు విరిగిపోయినట్లయింది.

చిన్నదొర అందరినీ తిడుతున్నాడు. ఇప్పుడొచ్చినది సింహాచలం తల్లి అని, తన అత్తగారని వాడికి గుర్తులేదు - బ్లడీహ్వోర్, బ్లడీబిచ్ ఇంకా అశ్లీల పదాల్ని ప్రయోగించి తిడుతున్నాడు - అప్పుడు మూర్తి ముందుకొచ్చాడు. మరొక ఏర్పాటు చెప్పమన్నాడు. మెయిలు వెనుకపోయే గుడ్సు ఇంజనొకటి సిద్ధంగా ఉంది. దానిని పంపమని చిన్నదొర చెప్పాడు. గుడ్సు ఇంజను చక్రాలు చిన్నవి - దానిని నలభై అయిదుమైళ్ళ వేగం దాటి నడవకూడదు. అప్పటికే అరగంట ఆలస్యమయింది. గుడ్సు ఇంజను తగిలిస్తే ఇంకా లోవలో లేటయిపోతుంది. మూర్తి మరో ఏర్పాటు చేశాడు - గూడ్సు ఇంజను డ్రైవరు మునుసామిని సాయంకాలం వెళ్ళవలసిన పాసింజరు యింజనును పంపుదామన్నాడు - ఇంజనుకి రిపేర్లవలేదు. ఆలస్యమవుతుందని దొర గునిశాడు. ఇంజనుకు నీరు నింపుతుంటే రిపేర్లు పూర్తిచేశాడు సుందరం - నేటివ్ డ్రైవరు మునుసామి మెయిలు నడపటం బట్లరుదొరకి ఇష్టంలేదు. అది అసలు రహస్యం ఏదయితేనేం మెయిలు వెళ్ళిపోయింది.

ఇంతలో పోలీసులు రంగంలోకి వచ్చారు. జిల్లా రైల్వే అధికారి ఒకతను వచ్చాడు.

"ఎవరీమె ?" పోలీసు ఇనస్పెక్టరు ప్రశ్నించాడు.

అందరికీ ఆమెపేరు పైడమ్మని తెలుసు. సింహాచలం తల్లి అని తెలుసు ఆమె కొడుకు పాపయ్య షెడ్డులో పనిచేసే కళాసీ అనితెలుసు ఎవరూ ముందుకొచ్చి మాట్లాడరు.

తల్లి చచ్చిన సంగతి సింహాచలానికి తెలియదు. ఈమధ్య దొర ఏం చేస్తున్నాడంటే ఆమెను బంగళాలోపెట్టి తాళం వేస్తున్నాడు - తాను న్నప్పుడు లోపల తాళం వేసుకుంటాడు. ఆమెకు కబురు అందజేసినా ప్రయోజనంలేదు - దొర ఆమెను పైకిరానీయడు.

ఇక పాపయ్య సంగతి - వాడు రాత్రి డ్యూటీలో ఉన్నాడు - వాడి దగ్గరకి ఒకరిద్దరు పరుగెత్తారు. వాడు హాయిగా భోజనంచేసి పడుక్కున్నాడు- తల్లిముండ ఏ మూడుకోవచ్చి తిండి తింటుంది. పొద్దున్న గుండెమొయ్యా చద్దన్నం తింది. ఆమె వచ్చేవరకు వాడు హాయిగా నిద్రపోతాడు - అరగంట సేపు ఇంటి తలుపులు బాది వాడిని లేపేసరికి కబురుచెప్పిన వాళ్ళు మూడు చెరువుల నీళ్ళు తాగారు - 'ఒరే పాపిగా ! నీతల్లి బండికిందపడి చచ్చిందిరా !' అని వాళ్ళు చెప్తే వాడు తల్లికోసం ఏడవలేదు - ఎవరెవరికి డబ్బు అప్పిచ్చిందో చెప్పకుండా చచ్చిపోయినందుకు ఏడవడం మొదలుపెట్టాడు. పోలీసులొచ్చారని ఎంక్వయిరీ జరుగుతుందని వాళ్ళు చెప్తే వాడు ఇంటికి తాళం వేసుకొని సీతమ్మ ధారకొండమీదికి పారిపోయాడు - పోలీసులు సోదాచేస్తే తాకట్టు సామాన్లు తనఖాపత్రాలు దొరకుతాయని భయపడ్డాడు.

పైడమ్మ ముసిలిది చావడానికి మూడే కారణాలు.

మొదటిది, సొట్టదొర బట్లరు, మెయిలు డ్రైవరును ఇటు అటూ చూడకుండా ఇంజనును నడిపించమని తొందరపెట్టడం.

రెండవది, అబ్రిహాము దొర ఎంతమంది బట్లరు దొరలు అరచినా రెండు ప్రక్కలా చూచి, ఎవరూలేరని నిశ్చయానికి వచ్చిన తరువాతే ఇంజను నడిపించవలసి ఉంది. ఆ విధిని అతడు ఉల్లంఘించడం.

మూడవది, ఇతరులకు ప్రవేశార్హత లేనిచోటుకి పైడమ్మ ప్రవేశించడం అనధికారంగా బొగ్గులేరడం కోసం పట్టీల మధ్యకు రావడం -

ఈ కారణాలు ఎంక్వయిరీలో ఒకేఒక్క కారణమయాయి. పైడమ్మ ట్రెస్ పాస్ చేయడం ఒకటే అపరాధంగా నిలిచింది.

శవపంచాయితీ అయిపోయింది. ఉద్యోగులెవరూ ముసిలిదాని చావుకు బాధ్యులుకారని తీర్పు ఏకగ్రీవంగా అధికారులిచ్చారు. అపుడు రెండుగా తెగిపడిన శరీరం ఎవరికి అప్పజెప్పడమనే సమస్యవచ్చింది.

"ఈమె మనుషులేరి?" పోలీసు ఇనస్పెక్టరు చుట్టూ నిలిచిన పనివాళ్ళను అడిగాడు.

ఎవరూ ముందుకురాలేదు.

"ఈమెకెవరూ లేరా ?" మళ్ళా అందరినీ చూస్తూ అతనే అడిగాడు.

కొంచెం సేపటి తరువాత ఒకతను ముందుకొచ్చి అన్నాడు.

"ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు ?"

"కొడుకుకి కబురువెళ్ళిందా ?"

"3647 వెళ్ళివచ్చాడు సార్ ! ఆ కొడుకు ఎక్కడికో పోయాడు. ఇల్లు తాళం సార్ !"

"కూతురెక్కడుంది ?"

అందరూ చిన్నదొరవేపు చూశారు.

చిన్నదొర నవ్వుతూ ఇనస్పెక్టరుతో అన్నాడు

"ఆమె ఎక్కడుందో ఎవరికీ తెలీదు".

"మరెవరూ లేరా ? చెప్పండి - ఎవరూ లేకపోతే మునిసిపల్ హెల్తాఫీసరుకు ఫోనుచేసి చెత్తబండిలో ఈడ్పిస్తాను".

అందరు ముఖాలు చూచుకుంటున్నారు.

అపుడు సుందరం ముందుకొచ్చాడు.

"ముసిలిది నీకేమవుతుంది ?"

"నేను ఈ షెడ్డులో అడుక్కోడానికి వచ్చిన మొదటి రోజున నా కంచంలో ఆదరంతో మొదటి కబళం పెట్టింది ఈమె. ఆనాటినుండి నేను ఉద్యోగంలో చేరేవరకు నన్నుసాకింది. ఈమె నాకు తల్లికన్న హెచ్చు. నేనొక్కడినే కాను. ఇక్కడ నిలబడ్డ వాళ్లందరికీ అపురాలే. ఆమెకు దిక్కులేని చావు దేనికి ? మాకిచ్చేయండి ఈ శరీరాన్ని".

సుందరం కాంటీను సేల్సునుండి నూరు రూపాయలు అప్పుతెచ్చాడు, మర్నాడు బాంకినుంచి తెచ్చిఇస్తానని - నరసింహారావుకూడ ఆమోదించాడు. పని వాళ్ళు ముందుకొచ్చారు.


చైతన్య కవిత

కేవలం కవితావళికే అంకితమైన పత్రిక

సంపాదకులు: తంగిరాల సుబ్బారావు, ఆర్వీయస్. సుందరం

ఏడాదికి రెండు సంచికలు: వసంతం, శరత్తు

అక్షయ-శరత్సంచిక ఆకర్షణీయంగా వెలువడుతోంది (1/8 డెమ్మీసైజు, 80 పుటలు)

శేషేంద్ర, కరుణశ్రీ, దాశరథి, సోమసుందర్, జ్వాలాముఖి, విశ్వేశ్వర్, గోదావరిశర్మ, మిరియాల ప్రభృతుల సత్కవితా స్రవంతి....

ఇంకా కన్నడ, హిందీ, పంజాబీ, ఒరియా, ఆఫ్రికన్, రష్యన్, ఆస్ట్రేలియన్ దేశవిదేశాల పొంగుల్లు.....

సంవత్సరచందా: పదిరూపాయలు మాత్రమే.

జీవితసభ్యత్వం : 200 రూపాయలు.

వివరాలకు : డా॥ టి.వి. సుబ్బారావు,
ఆర్-2, జ్ఞానభారతి,
బెంగుళూరు - 560 056.

ఎవరూ లేరనుకున్న సింహాచలం తల్లి తిన్నగా వైకుంఠానికే వెళ్ళిపోయిందారోజు.

## 9

ఆ రోజు ఇంజన్లషెడ్డు ఇనస్పెక్షను జరుగుతున్నది. ఆ పని చేస్తున్న అధికారి కలకత్తా ప్రాంతాలనుంచి వచ్చాడు. అతనిపేరు ఫిలిప్స్ నూటికి నూరుపాళ్ళు అతను ఆంగ్లేయుడు - మనిషి ఆరడుగులకు పైగా పొడవుంటాడు- పొడవుకుతగ్గ శరీరం - అతను తెల్లనిబట్టలు వేసుకున్నాడు. అతని నోటిలో ఎప్పుడూ పైపుంటుంది. ఆ పైపు నోటిలో ఉన్నప్పుడు అతను మాట్లాడితే ఎవరికీ బోధపడదు.

ఇటువంటి అధికారి సంవత్సరానికోసారి వచ్చి తనిఖీచేసి వెళ్ళిపోతుంటాడు. క్రిందటిసంవత్సరం వచ్చిన అధికారి ఉద్యోగంనుండి విరమించి మాతృదేశం వెళ్ళిపోయాడు - అతని స్థానంలోవచ్చిన ఈ అధికారి ఇంగ్లండులో ఇంజనులు తయారుచేసే కర్మాగారంలో పని చేస్తున్నప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం అతనిని భారతదేశానికి పంపింది. అతను చాలా పెద్ద యింజనీరు. చిన్న తనంలోనే ఉన్నతస్థాయికెక్కినవాళ్లలో ఇతనొకడు.

వారం రోజులనుండి, ఫిలిప్సుదొర తనిఖీకి వస్తున్నాడని ఇంజన్లషెడ్డు కింద మీద చేస్తున్నారు - రంగులువేసి, సున్నాలుకొట్టి, మట్టి ఊడ్చి బొగ్గు కుప్పలు సర్దిచేసి, సేఫ్టి స్లోగనులు రాయించి, డ్రైవర్ల సామాగ్రి సరిచేసి అందరూ క్రిందామీదా పడుతున్నారు.

ఉదయం అతను తొమ్మిది గంటలకు వచ్చాడు - పన్నెండు వరకు తిరుగుతున్నాడు షెడ్డులోను, పైనకూడా - హిందూదేశపు జూలై నెల ఎండకి అతను ముఖం కందగడ్డవలె ఎర్రబారిపోయింది. అతని తెల్లనిబట్టలు చెమటతో తడిసిపోయాయి - అతను తరచు కళ్ళజోడును తెల్లని రుమాలుతో తుడుచుకుంటూ, కారే చెమటను మరొకదానితో అద్దుకుంటూ పెద్దదొర ఆఫీసులోకివచ్చి కూర్చున్నాడు.

అతడు కూర్చొని ప్రత్యేకంగా తనతో తెచ్చుకొన్న పెద్ద ఫ్లాస్కునుండి లైమ్‌జూస్ కార్డియన్ వంపుకొని తాగి తాపీపడ్డాడు - అప్పుడు చప్రాసీ వీరాసామి లోపలికొచ్చి పెద్ద దొరకొక చీటీ ఇచ్చాడు.

వీరాసామి ఆస్పత్రినుండి విడుదలయిన రెండు నెలల తరువాత తిరిగి ఉద్యోగంలో ప్రవేశించాడు. అతను బలమయిన పనులు చేయడానికి తగడని. తేలిక ఉద్యోగం ఇవ్వవలసిందని కంపెనీ డాక్టర్లు సిఫారసు చేశారు. వీరాసామికి చదువులేకపోవడంవలన పెద్దదొర ఆఫీసులో చప్రాసీ ఉద్యోగం ఇచ్చారు.

మూర్తి కోసం చేస్తున్న ఎంక్వయిరీ పూర్తి అయిపోయింది. దానికి అధికారిగా వర్తించిన దొర చాలా గొప్పవాడు. ఇనస్పెక్టరు వుల్ఫుదొర వ్రాసిన రిపోర్టు, రికార్డులో ఉన్న పాత రిమార్కులు, అన్నీ సమగ్రంగా పరిశీలించి మూర్తి నూటికి నూరుపాళ్ళు దోషి అన్న అభిప్రాయానికి వచ్చాడు. మూర్తిని ఉద్యోగంనుండి తీసివేయవచ్చని తన తీర్పుని వివరించాడు. ఇవన్నీ రహస్యంగా జరిగినవి. ఇవి ఎవరికీ తెలియకూడదు. అయినా డివిజనల్ ఆఫీసులోనున్న నేటివ్ స్టెనోగ్రాఫరు మూర్తికి జరుగుతున్న అన్యాయానికి చాల విచారించి నరసింహారావుకి ఎంక్వయిరీ ఫలితాన్ని సూచా వాచా తెలియజేశాడు. ఈ విషయం వారం రోజులక్రిందే సుందరం చెవిని పడింది. సుందరం వెంటనే వీరాసామిని కలుసుకున్నాడు. వీరాసామి శకునివంటివాడు - చాలా మంచి సలహాలు ఇవ్వగలడు. వీరాసామికి అందరికన్నా పెద్ద అధికారి వారం రోజులలో వస్తున్నాడని తెలుసు - ఎంక్వయిరీ రిపోర్టంతా ఆ దొరకే పంపిందారని కూడా తెలుసు. రక్షించడం అతని ఒక్కడికే సాధ్యం. ఆ అధికారికి మూర్తి గురించి సరిగా తెలియదు - మూర్తి చాలా శ్రమపడవలసిన వాడని పనిలో చాల మెలకువలు తెలిసినవాడని, తన క్రింద పనివాళ్ళచేత హెచ్చుపని చేయించగలవాడని, వాళ్ళతో మంచి సంబంధాలు కలవాడని, రైళ్లు సకాలంలో నడవడానికి అతను మూలకారణమని ఆ దొరకు తెలియదు. అటువంటి మనిషి షెడ్డుకి చాలముఖ్యం. అతనిపై మోపిన నేరాలు క్షమించరానివికావు. ఉన్నతాధికారి న్యాయం విచారించి మూర్తిని ఉద్యోగంనుండి తొలగించకూడదు- ఇది షెడ్డులో పనిచేసే ఏడువందల మంది అభిప్రాయం - మహజరు ఈ విధంగా రాసి, దానిమీద ఏడువందల మంది సంతకాలు తీసుకొని ఇనస్పెక్షను సమయంలో ఉన్నతాధికారికి సమర్పించాలి.

రాత్రిళ్లు, పగళ్లు నిర్విరామంగా ఇంజన్ల షెడ్డు ఉద్యోగులందరినీ కలసి, గురునాధం పంతులు ముక్తసరిగా వ్రాసిన మహజరు మీద సంతకాలు తీసుకున్నాడు సుందరం - ఆ విషయం మూర్తికి తెలిసి చాల బాధపడ్డాడు - దొరల దయను అర్ధించే పద్ధతి అతనికి ఏవిధంగా నచ్చలేదు. పనివాళ్ళ ఇష్టానికి అతను వ్యతిరేకంగా వెళ్ళలేకపోయాడు-

ఇనస్పెక్షను నాడు పన్నెండు గంటలవేళ రమారమి నాలుగు వందల మంది పనివాళ్ళు ఆఫీసు ముంద వరుసలలో నిలబడ్డారు - సుందరం మహజరు చేతితో పట్టుకొని ఉన్నతాధికారిని కలియదలచినట్లు చీటీ పెద్దదొరకు పంపించాడు.

పెద్దదొర చాలా కోపపడ్డాడు. కొత్తగావచ్చిన అధికారిని ఎవరూ కలియడానికి వీలుపడదని ఆ చీటీ చింపిపారేశాడు. లైమ్‌జ్యూస్ తాగిన ఫిలిప్సు దొర చిరిగిన కాగితాన్ని, పెద్దదొర ఆగ్రహాన్ని గమనించి ప్రశ్నించాడు.

"ఏమిటి విశేషం ?"

"స్టాఫ్ ఎవరో మిమ్మల్ని చూస్తానంటే నేను వారిస్తున్నాను. మీరు ఎండలో చాల అలసిపోయారు-" అన్నాడు పెద్దదొర.

ఫిలిప్సుదొర నోటినుండి పైపు తీశాడు.

"ఐసీ ! వాళ్ళు నన్ను కలియదలిచితే ఆటంకం లేదే- అన్నిటికన్న మొదటిది పనివాళ్ళ కష్టసుఖాలు తెలుసుకోవడం - వాటిలో ఒకరిని లోపలికి రమ్మనండి - మాట్లాడడానికి నాకేమీ అభ్యంతరం లేదు."

పెద్దదొర మరి అడ్డుచెప్పలేక పోయాడు-

వీరాసామి ఒక్క సుందరాన్నే లోపలికి తీసుకొనిపోయాడు.

ఫిలిప్సుదొర తన ఎదుట నిలబడిన యువకుడిని సావకాశంగా పైపు నోట్లోపెట్టుకొని చూశాడు.

సుందరం తెల్లటి ఖద్దరు నిక్కరు, చొక్కా తొడుక్కున్నాడు - ఆరడుగుల పొడుగుండి కండలు తిరిగిన మనిషినిచూచి ఫిలిప్సుదొర ఆశ్చర్యపోయాడు.

సుందరం ఫిలిప్సుదొరకు నమస్కారం చేశాడు. తాను సంతకాలు పెట్టించిన మహజరు అతనికి ఇచ్చాడు - అతను దానిని చదువుకున్నాడు. విషయమేమిటని పెద్ద దొరని ప్రశ్నించాడు. అతను చెప్పినదంతా విన్నాడు. కొంచెంసేపు ఆలోచించాడు.

"కేసు జాగ్రత్తగా చదవంది నేను ఏ విధమైన మాట ఇవ్వలేను. కాని ఒక్కసంగతి చెప్తున్నాను, ఉద్యోగంనుండి ఒక వ్యక్తిని తొలగించవలసి వచ్చినప్పుడు చాలబాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావడం జరుగుతుంది. ఇంతకుమించి నేను మరేమీ వాగ్దానం చేయలేను-"

సుందరం దొరలకు నమస్కారం చేసి పైకివచ్చాడు. నాలుగువందల మందికి దొరగారి మాటలు చెప్పాడు - అందరూ నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు.

దేశభవిష్యత్తులో మార్పులు ఉదయిస్తున్నవి.

దొరలకు గడ్డురోజులు వచ్చాయి - వారు దేశం విడిచి పోవలసిన

సమయం ఆసన్నమయింది. కొంతమంది ఆస్ట్రేలియాకు, కొంతమంది ఇంగ్లాండుకు పోవడానికి ఏర్పాటులు చేస్తున్నారు. కొంతమంది సిమ్లాలోనో, బెంగుళూరులోనో స్థిరపడాలని అనుకుంటున్నారు.

చిన్నదొర బట్లరు మహాశయునికి నిజమైన సంకట పరిస్థితులెదురయాయి. సింహాచలం ఉండుండి ఎదురు తిరుగుతున్నది - తల్లి చనిపోయినప్పుడు తనకు చేసిన అన్యాయం ఎప్పటికీ మరచిపోలేక పోతున్నది. దొరకు తాగడానికి బుడ్లు పూర్వంవలె సప్లయి అవడంలేదు - ఉద్యోగాలు నిలిచిపోవడంతో అన్ని సప్లయిలు ఆగిపోయాయి. సింహాచలం తమ్ముడు తప్పించుకు తిరుగుతున్నాడు. తల్లి వడ్డీకి తిప్పిన వేలకొలది రూపాయల గురించి రాత్రి పగలు ఆలోచిస్తాడు. కనిపించినవాడిని తన తల్లి అప్పిచ్చిందా అని అడుగుతాడు. అప్పు పుచ్చుకున్న పెద్దమనుషులెవరూ ముందుకురారు. ఆ విధంగా రెక్కలు ముక్కలు చేసుకొని పైడమ్మ కూడబెట్టిన డబ్బు మట్టిపాలయింది.

చివరకు బట్లరుదొర ఇంగ్లాండు వెళ్ళిపోడానికి నిశ్చయించాడు. స్టీమరు టిక్కట్టు కొనుక్కున్నాడు. హిందూదేశం స్వాతంత్ర్యం పొంది హర్షిస్తుంటే చూడలేనన్నాడు. బానిసలందరూ స్వేచ్ఛగా బ్రతకడానికి అర్హులుకారన్నాడు ఇంట్లోని సామానంతా అమ్మేశాడు.

సుందరం చాలాకాలమయి మూర్తి సహవాసంతో ఖద్దరు కట్టడం, నూలు వడకడం చేస్తున్నాడు. నూలు వడుకుతున్నంత సేపు మనసు నిలిపి ఉంచడం అభ్యసించాడు. శరీరం ఎంత కట్టుబాటులో ఉందో అంతకు పదిరెట్లు మనసు కట్టుబాటులో ఉండాలనుకుంటాడు. భగవద్గీత చదువుతాడు. శ్లోకాలకు తాత్పర్యం చదివి తన జన్మను సార్థకం చేసిన నరసింహారావుకి వేయి నమస్కారాలు చేస్తాడు. ఒక్కొక్కరాత్రి నిద్రపట్టనప్పుడు ఏదో జ్ఞాపకమొస్తుంది. కదలకుండా తనను కౌగిలిలో బిగించి, మెత్తటి పెదవులతో తన పెదవులను బలంగా అదిమి పరవశమైన సింహాచలం జ్ఞాపకమొస్తుంది. తరువాత తన నిస్సహాయస్థితి బాధపెడుతుంది. ఆ దొరను రెండు గుద్దులతో హతమార్చి వాడి బారినుండి సింహాచలాన్ని రక్షిస్తేనో! అవేవీ జరగని పనులు అటువంటి తెలివితక్కువ పనులుచేస్తే సింహాచలంకాదు లభించేది, శ్రీకృష్ణ జన్మస్థానం.

మూర్తి రోజులు లెక్కపెడుతున్నాడు. ఏదో ఒకరోజు వంచిన తన కంఠంమీద అధికారుల ఖడ్గం పడుతుంది. దానితో తనకు ఈ యింజన్ల షెడ్డుకు ఋణం తీరిపోతుంది. దాని గురించి అతను బాధపడలేదు. తనతో ఆరు సంవత్సరాలయి ఎండలోను వానలోను పనిచేసి ఇంజన్లను సకాలంలో పంపడానికి కారణభూతులైన సోదర కార్మికులను విడిచిపెట్టడమే గొప్ప బాధగా అతను భావించాడు.

గురునాధం పంతులు మేనమామ ఒకరోజు వచ్చారు. పది రోజులలో స్వాతంత్ర్యం దేశాన్ని వరించబోతున్నది. ఇప్పటికే నా అతను తన కూతురుని పెళ్లాడతాడా లేడా అని కనుక్కోడానికి వచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏరోజు ముహూర్తం పెడితే ఆ రోజు తాను విజయనగరంలో వాలు తానని లాయరుగారికి హామీ ఇచ్చాడు అతను.

నరసింహరావు చేతిలో సుందరం ఒక పార్సెలుంచాడు. అతను దానిని విప్పిచూస్తే ఖద్దరు చీర, ఖద్దరు పంచెలచాపు ఉన్నాయి. రెండింటికి నీలం పట్టు అంచులున్నవి, చీర అంచు చాల వెడల్పుగా ఉంది. బట్ట అంత ముదకగాలేదు. వాటిని చూసి అతను ఆశ్చర్యపోయాడు.

"ఇవెక్కడివి ?" అతను ప్రశ్నించాడు.

"నేను వడికిన నూలుతో తయారయినవి. అన్నాడు సుందరం.

"నువ్వెప్పుడు నూలు వడుకుతున్నట్లు నాతో చెప్పలేదే !"

"అవును, చెప్పలేదు-నేను తీసిననూలు నేతకు పనికివస్తుందో రాదో నాకు తెలియదు-సంవత్సరం బట్టి నేను తీసిన నూలు ఈ మధ్య పొందూరులో ఇచ్చి వచ్చాను - అక్కడి పట్టు శాలీలు ఆ నూలును తీర్చి దిద్ది పంపిన పార్సెలు ఇది".

"వీటినేం చేయమంటావు ?"

"మీరు, అమ్మగారు కట్టుకోవాలని నా కోరిక".

"నాకు గాంధీగారంటే గౌరవమే - ఖద్దరు మాత్రం కట్టలేను. బరువు మోయలేను. నా భార్య నాకన్న సుకుమారమైనది".

"మన మూర్తిగారు, వారి భార్య ఖద్దరే కడతారు".

"పోనీ వాళ్ళకివ్వకూడదా !"

"వీటిని మీ కోసమే నేయించాను. మరొకరికివ్వడం నాకిష్టం లేదు". నరసింహారావు చిరునవ్వు నవ్వాడు.

"సుందరం ! వీటి అవసరం కూడా దగ్గిర పడింది"అని వాటిని తిరిగి కాగితంలో కట్టి లోనికి తీసుకొని పోయాడు.

భారతావనిలో స్వాతంత్ర్య దుందుభులు మ్రోగాయి.

శిరచ్ఛేదంకోసం తలవంచిన మూర్తి కంఠం పుష్పమాలాలంకృతమయింది. కలకత్తా నుండి ఉన్నతాధికారి పెద్ద దొరకు ఫోన్ చేశాడు. వెంటనే మూర్తి మీద బనాయించిన కేసు యజమానులు రద్దు చేస్తున్నారని, స్వాతంత్ర్యం దేశానికి వస్తున్న శుభ సమయంలో ఈ సంతోష వార్త పని వాళ్ళందరికి ముందు చెప్పమన్నారని సందేశం వచ్చింది. మూర్తిని, ఆ రోజు మహజరు సమర్పించిన యువకుడిని, ఇద్దరు ఖద్దరు ధారులను స్వాతంత్ర్య దినోత్సవాలకు తగు ఏర్పాటులు అలంకరణ చేయడానికి నియోగించవలసిందని ఆదేశం వచ్చింది. పెద్దదొర ఈ విషయం పనివాళ్ళందరికీ చెప్పించి, మూర్తిని తన ఆఫీసులోకి పిలిపించాడు. ఎప్పుడు తన దగ్గర నిలబడే మాట్లాడవలసిన అతనిని సరసనే కుర్చీమీద కూర్చోమన్నాడు. సుందరాన్ని


ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్ల మచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం

"డాగ్ వినాశక్"

వాడినయెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Address

M/s. SAMAJ KALYAN (R.L.) - 15
P. O. KATRI SARAI (GAYA). Pin. 805 105

కూడా పిలిపించాడు. అప్పటికి స్వాతంత్ర్య దినం వారం రోజులే ఉంది. ఈ వారం రోజులలోను దొరల ఇన్స్టిట్యూటులో తోరణాలు కట్టి, కాగితం పువ్వుల దండలు వ్రేలాడ దీసి, దేశనాయకుల చిత్రాలు వరుసగా గోడలకు తగిలించి అలంకరించమన్నారు- ఖర్చుల క్రింద డబ్బు ఇచ్చారు.

మూర్తిమీద కేసును తొలగించిన మరునాడే బట్లరు దొర ఇంగ్లండుకు బయలు దేరాలి. సామానంతా అమ్మి ఆ సాయంకాలం అతను రైలెక్కి- బొంబాయిలో స్టీమరు పట్టుకోవాలి. మూడు నాలుగు రోజుల నుండీ అతను తాగిన మత్తులోనే ఉన్నాడు. రానురాను సింహాచలం అతనిని దగ్గిరకి రానిచ్చేది కాదు. అతను వెళ్ళిపోవలసిన రాత్రికి ముందు ఆమె ఆ బంగళా నుండి తప్పించుకొని పారిపోయింది. కునిసిపోడిన పంపించి వెతికినా లాభం లేక పోయింది. తమ్ముడింటా లేదు, ఎక్కడా లేదు. బ్లడీబిచ్‌ని దొర కాల్చి చంపాలనుకున్నాడు, తన యెడల అంత నిర్లక్ష్యంగా ప్రవర్తించినందుకు. చిన్నదొర వెళ్ళిపోతుంటే ఒక పనివాడు కూడా స్టేషనుకు పోలేదు. అతను బొంబాయి చేరుకొని స్వాతంత్ర్య దినానికి ముందే స్టీమరెక్కి భారతదేశం విడిచి పెట్టాలని అనుకున్నాడు. కాని ఆ పని సక్రమంగా కాలేదు- బొంబాయికి వెళ్ళే దారిలో ఒక స్టేషనులో ప్లాట్‌ఫారమ్ మీద నుండి జారి పట్టీల మీదపడి పోయాడు. కదులుతున్న రైలు అతని మంచి కాలుమీంచి వెళ్ళిపోయింది. రెండు నెలలు బొంబాయిలో ఒక హాస్పిటల్‌లో ఉండి, రెండు కాళ్లులేకుండా ఇంగ్లాండు పోవడమెందుకని స్టీమరు మీద నుండి సముద్రంలో పడి చచ్చి పోయాడు. భారతదేశం మట్టిపై ఆ విధంగా చావకుండా అతను ప్రతిజ్ఞ నిలబెట్టుకున్నాడు.

ఆగష్టు పద్నాలుగో తారీకు రాత్రి పన్నెండుగంటలకు ఇంజన్లషెడ్డులో స్టీములో ఉన్నవాటి అన్నిటిమీద మనుషులెక్కి ఒక్కసారి ఫుంగాలు ఊదారు. పనివాళ్ళందరూ ఇనిస్టిట్యూట్‌లో నిండిపోయారు. ఇంతకాలం దానిని యూరో పియన్ ఇనిస్టిట్యూట్ అనేవారు. ఆ క్షణం నుండి అది ఇండియన్ ఇనిస్టిట్యూట్‌గా మారిపోయింది. డాన్సు చేయడానికి అనువుగా బల్లలు తాపిన నేల తళతళ లాడింది. రంగు రంగుల కాగితాల తోరణాలు, కాగితపు పువ్వులు కళ్ళను ఆ కట్టుకునే విధంగా అలంకరించారు. అగరుధూపం అంతటా అలముకుంది. కొబ్బరి కాయకొట్టి దేశమాత చిత్రం దగ్గిర నూనె దీపాలు వెలిగించారు- బాణ సంచాలు కాల్చారు. యూరోపియన్లు, ఆంగ్లో ఇండియన్లు, భారతీయులు అందరూ ఆ రాత్రి కలసి స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకున్నారు.

కన్నుల పండువుగా జరిగిన అలంకరణకు ఇద్దరే బాధ్యులు-మూర్తి, సుందరం - వాళ్ళ ఆధ్వర్యంలోనే అన్ని పనులు జరిగాయి. ఉత్సవ సమయానికి మూర్తి దేశీయ విధానంలో వస్త్రధారణ చేశాడు, ఖద్దరు పంచ, బెంగాలీ లాల్చీ. దానిపైన వాణీ, నుదుటకు తిలకం, తలమీద గాంధీ టోపీ- ఆ వేడుకల సంరంభంలో పెద్దదొర మూర్తిని, సుందరాన్ని అందరి సమక్షంలో అభినందించి వారికిగల దేశ భక్తికి ప్రశంసలు చేశాడు.

వేడుకలన్నీ అయిపోయాయి. దేశం మనదయింది. ఇంతవరకు పరదేశ పాలనకు అనువుగా పనిచేసిన వాళ్ళు ఇకమీద స్వదేశం కోసం పని చేయాలి. సాంకేతిక రంగంలో కార్మికులందరూ భారతీయులే. అధికారులలో ఒకరో ఇద్దరో భారతీయులు తప్ప మిగిలినవారు విదేశీయులే. వాళ్ళు ఒక్కసారి దేశం విడిచి వెళ్ళినప్పుడు వారు లేనిలోటు పూర్తి చేయవలసిన అవసరం ఎంతేనా మనమీద ఉంది. సుందరం ఈ పరిస్థితులని అర్థం చేసుకున్నట్లు ఒక రోజు, ఉత్సవాల గురించి పనిచేస్తున్నప్పుడు, మూర్తితో అన్నాడు.

"మూర్తిబాబూ! తెల్లవాళ్ళు వెళ్ళిపోతున్నారు. వాళ్ళే ఇంతకాలం వ్యవహారం నడిపించారు. మనని బానిసల స్థాయిలోనే ఉంచారు- అన్ని కిటుకులు, రహస్యాలు తమతోనే పట్టుకుపోతున్నారు - - మనలో ఎవరమేనా ముందుకొచ్చి పని నేర్చుకుందామన్నా వాళ్ళు హేళనచేసి, మభ్యపెట్టి ఏమీ నేర్ప లేదు. ఇదికూడా ఒక మంచికే వచ్చింది. మనయిల్లు చక్కదిద్దుకోడంలో వాళ్ళ పద్ధతులు అవలంబించనక్కరలేదు. మన యింజన్లను మనమే బాగు చేసుకోగలం - మనమే నడుపుకోగలం - రాబోయే తరాలవారికి మన విద్య నేర్పడానికి. ప్రస్తుతం పనిచేస్తున్నవారి స్థాయిని పెంచడానికి ట్రెయినింగు అవసరం. బహుశా ప్రభుత్వంకూడా ఇటువంటి అవకాశాలు కల్పించవచ్చు. మీరు చదువుకున్నారు- విషయం బాగా తెలిసినవారు. మా వంటి వారికి చెప్పగలరు. ఉత్సాహమున్న వారికి క్రమ పద్ధతిలో శిక్షణ ఇవ్వడానికి ఒక చిన్న సంఘాన్ని మనం ప్రారంభించవచ్చు. దానిని కూడా ఈ స్వాతంత్ర్యం లభిస్తున్న శుభవేళ మనం ప్రారంభించుతే బాగుంటుంది".

సుందరం చెప్పిన మాటలు మూర్తికి చాల నచ్చాయి. ఇప్పుడు నిజమయిన పరీక్షా సమయం వచ్చింది. భారతీయులు తమ దేశాన్ని పాలించు కోలేరని బ్రిటిష్‌వారి అభిప్రాయం. దానిని పోగొట్టడానికి ప్రతి భారతీయుడికి బాధ్యత ఉంది. తాను ఈ దేశంలో ఒక భాగం- ఈ దేశం బాగుపడితే తను బాగుపడతాడు. నిర్మాణాత్మకమైన మార్గంలో ముందుకు నడవడమే ధ్యేయం.

పెద్ద దొర ఇంజన్ల పనివాళ్ళ శిక్షణా కేంద్రానికి ప్రారంభోత్సవం చేసాడు. ఆగష్టు పదిహేనో తారీకున షెడ్డులో ఒక గది వాళ్ళకిచ్చి, తన దగ్గిరనున్న సాంకేతిక గ్రంథాలను బహూకరించాడు. ఆ కేంద్రానికి పెద్ద దొర అధ్యక్షుడు- మూర్తి కార్యదర్శి. సుందరం మరో నలుగురు కార్యవర్గ సభ్యులు - బ్లాక్ బోర్డు, టేబిలు, కుర్చీ, బెంచీలు అన్నీ తెచ్చారు. ప్రారంభోత్సవం చాల ఘనంగా జరిగింది.

వారం రోజులు నిర్విరామంగా పనిచేసిన మూర్తి అలిసిపోయాడు. ఉత్సాహంతో ఎంతపని అయినా వెనుకాడకుండా పూర్తి చేశాడు. వేడుకలన్నీ అయిపోయిన తరువాత అతను చాల బడలిపోయాడు. రెండు, మూడు రోజులు లేవలేకపోయాడు. ఎంత శ్రమపడినా అతని హృదయం మాత్రం ఆనందంతో నిండిపోయింది. ఉద్యోగం స్థిరపడిందని కాదు, దేశం విశృంఖల మయిందని.

తిండి తిప్పలుకూడా మరచిపోయి సుందరం వారంరోజులు పనిచేశాడు. ఒక్కొక్కప్పుడు ఇంటికి వాడు రాలేకపోతే నరసింహారావే భోజనం పట్టు కొచ్చాడు. మూర్తికి వచ్చిన భోజనం ఒకప్పుడు ఇద్దరూ పంచుకొనేవారు. అయిదారుగురు చేయవలసిన పని వాడొక్కడే సునాయాసంగా చేసేవాడు. విసుగులేకుండా, అలిసిపోకుండా, నాలుగయిదు గంటలు నిద్రపోయి మిగిలిన కాలమంతా పనితోనే వాడు గడిపేవాడు. వాడే లేకపోతే అనుకున్న ప్రకారం అలంకరణ జరిగి ఉండేదికాదని మూర్తి అందరితోను చెప్పాడు- వాడిని ఎంతో మంది ఎన్నో విధాలుగా మెచ్చుకున్నారు.

కాని,

హాఫ్‌లేస్‌గాడు ఇంటికి తిరిగివచ్చి చాల నిరుత్సాహంతో నులకమంచం మీద కూలబడ్డాడు. వాడు సింహాచలం కోసం చాలచోట్లు గాలించాడు. ఆమె ఎక్కడుందో ఎవరికీ తెలియదన్నారు. అన్ని పనులు సక్రమంగా నెరవేరి వాడి మనసును ఇతరమైన ఆలోచనలు విడిచి పెట్టాయి. ఆ ఖాళీ అయిన హృదయంలో ఒక్క సింహాచలం మాత్రం సింహాసనం వేసుకొని కూర్చుంది. ఆమె పైని ఆలోచనలు మాత్రం విడువకుండా వెంటబడుతున్నవి- జీవితంలో ఇంత వరకు వాడు ఒంటరిగానే బతికాడు. ఇప్పుడు వాడికి సింహాచలంపై ఆలోచన దేనికి?

వాడు కూడా సింహాచలాన్ని మరచిపోవాలని చాల ప్రయత్నాలు చేశాడు. పనిపట్టీ దారం తీయడానికి కూచుంటే దారం మాటి మాటికి తెగి పోయేది. భగవద్గీత చదవాలని కూచుండే పుస్తకంలోని పేజీలమీద అక్షరాలేవీ కనిపించేవి కావు. అక్కడ సింహాచలం ముఖం నవ్వుతూ దర్శన మిచ్చేది. సింహాచలం బొగ్గులు బుట్టమీద కూచొని మాట్లాడుతుంటే ఎంత బాగుండేది?

# ఏమి నాగరికత!

ప్రజలు సేసికొన్న పాపమెల్లనుబండె
వాన లేక పైరు పచ్చలెండె!
అన్న వస్త్రములకు నల్లాడఁ జొచ్చిర
పట్టనములయందుఁ బల్లెలందు.

మాన్యములు మంటి దిబ్బలు
ధాన్యము శూన్యంబు, నిత్య దారిద్ర్యమె, సా
మాన్య స్థితి యయ్యె జగ
న్మాన్యుఁడ! నీ చిత్త మవల మాభాగ్యమగున్,

గుడిలోని లింగమున కం
గడి లోపలి బెల్లమనుట! కడు నిక్కముగా,
బొడవగుడు వెలలు, వేడ్కలు
నిడుపటి మధ్యాహ్నవేళ నీడలె యయ్యెన్!

ఏమి నాగరకత! ఏమి సౌలభ్యంబు
అడుగవలెనె! సొంపు నుడువవలెనె!
వనధి ఘోషమట్లు వినఁబడు చుండంగ
యంత్రబలము బుద్ధి తంత్రఫలము!

ప్రక్క బిడుగులకును ప్రక్క పోటులెకాని
శిరమువెత్తి తిరుగఁ దెరువు లేదు;
చిన్న చేప పెద్ద చేత పొట్టనె కాని
కదలి నీట నీఁద వెడలరాదు!

.... .... .... .... .... .... .... .... ....

[ఫాటన్ అవ్ మాడరన్ సివిలిసేషన్ అన్న కవి వ్రాతప్రతిలో దొరికిన రచన. వారు దీనిని 5-7-1921 న రాశారు.]

## కైలాసవాసి-జనమంచి వేంకటరామయ్య

తనని ఈ విధంగా ఇబ్బందిలో పెట్టి ఆమె ఎక్కడికి పారిపోయింది ?

వాడు ఆ విధంగా ఆలోచిస్తుంటే పన్నెండు గంటలయింది. తొందరగా బట్టలు వేసుకొని వాడు నరసింహారావుగారింటికి భోజనానికి బయలుదేరాడు. ఆ సరికే నరసింహారావు వచ్చాడు. ఇద్దరూ కొంతసేపు వేడుకల గురించి మాట్లాడుకున్న తరువాత సుందరానికి ఆకువేసి వడ్డించడం మొదలు పెట్టారు.

సుందరానికి పెరటి వేపున్న వరండాలో భోజనం పెడుతారు. ఇవాళ కూడా అక్కడే పెట్టారు. వరండాకి అనుకొని ఒక చిన్నగది ఉంది. అందులో సామానులేవో పడేశారు. కాని ఇవాళ అందులో ఎవరో ఉన్నట్లు వాడికి అనుమానం కలిగింది. పదిరోజుల తరువాత మళ్ళా ఈ రోజే భోజనానికి వచ్చాడేమో వాడికేమో కొత్త అనిపించింది. నరసింహారావు భార్య వడ్డించింది. కూర, పచ్చడి, పప్పు- ఊరగాయ- అన్నీ వాడికి నచ్చినవే- పదిరోజుల తరువాత ఇవాళ భోజనం వాడికి అమృతంగా తోచింది. అమృతమన్నది స్వర్గంలోనే ఉంటుంది. స్వర్గంలో అప్సరలుంటారు. వారి ధమ్మిల్లాలలో పారిజాతసుమాల మాలికలు సుగంధాన్ని పంచిపెడతవి. వారి కంకణాల నిక్వాణంలో వీణానాద మాధుర్యముంటుంది. అటువంటి పరిస్థితులు ఎలా వచ్చాయని వాడు అనుకున్నాడు- వరండా చివరనున్న గదిలోంచి సంపెంగ పూల వాసన ప్రయాణం చేసి ఏవో జ్ఞాపకాలను కదిపింది. ఆనాటి రాత్రి సింహాచలం తన తలను లాక్కొని గాఢంగా చుంబించినప్పుడు ఆమె జడలోని సంపెంగ పూవునుండి ఇటువంటి వాసనే వచ్చింది. ఆమె చేతికున్న కడియాలకు గాజులు తగిలి అదో శబ్దం, వీణ మీద మీటినట్లే, తన హృదయాన్ని తాకింది. ఇక్కడా మృదువైన ధ్వని ఎక్కడినుంచి వచ్చింది ?

తలెత్తి అటువేపు చూడాలని అనుకున్నాడు. కాని ఎదురు గుండా అమ్మగారు నిలబడి అడిగి వడ్డిస్తున్నారు- శరీరకం అక్కడే ఉంది, మనస్సల్లా ఆమె ఎవరని ఉత్సుకతతో పరవళ్ళు తొక్కింది.

మధ్యాహ్నం సుందరం ఇంటికి గురునాథం పంతులు వచ్చాడు. తనుంటున్న అవుట్ హౌస్‌కి గౌరవనీయుడైన వ్యక్తి రావడంతో వాడు గాభరా పడ్డాడు. అతని కూర్చోబెట్టడానికి నులకమంచం తప్ప మరేది లేకపోయింది. అతను మాత్రం మొహమాటం పడకుండా దానిమీదే కూర్చున్నాడు.

"ఒరే హోప్లెస్ ! నాకు వచ్చే వారం పెళ్ళిరా ! నిన్ను పిలవాలని నేను స్వయంగా వచ్చాను- మనమందరం మగ పెళ్ళివారంరా ! మనం ఎల్లుండి శనివారం సాయంకాలం బండిలో విజయనగరం తర్లి వెళ్తున్నాము. నువ్వు పెళ్ళికొచ్చిన మనవాళ్ళందరినీ మర్యాద చేయాలి. తెలిసిందా !"

"బాబుగారూ ! ఎన్నాళ్ళకి మంచివార్త విన్నాను. తప్పకుండా నేను వస్తాను".

"ఇంకా మంచివార్త మరొకటుందిరా ! అది వినడానికింకా వ్యవధి ఉందిరా !"

గురునాథం పంతులుపెళ్ళి చాల ఘనంగా జరిగింది. వేణుగోపాలస్వామి మఠంలో పెళ్ళయింది. గురునాథం పంతులుగారి పెళ్ళికి వందమంది పని వాళ్ళు హాజరయారు. వాళ్ళందరికీ భోజనం ఫలహారాలు లోటు లేకుండా పెట్టించి సుందరం చాల సహాయం చేశాడు. పొద్దున్న తొమ్మిది గంటలకు ముహూర్తం. సాయంకాలానికి పెళ్ళి ముగిసింది. వచ్చిన పనివాళ్ళు వెళ్ళిపోతామన్నారు. కాని పంతులు వాళ్ళను ఆపు చేశాడు- సాయంకాలం గాన సభ ఉందని, రాత్రి డిన్నరుందని వారిని ఆపు చేశాడు.

ఆ సాయంకాలం గాన సభ ఎనిమిదికి ముగిసింది. అపుడు నరసింహారావు హోప్లెస్‌గాడికి ఖద్దరు చాపు ఒకటిచ్చి, స్నానంచేసి దానిని కట్టుకోమన్నాడు. వీరాసామి వాడికి పంచకట్టించి, మరొకటి పింజెలుపెట్టి భుజం మీద వేసి, నుదుట కుంకుమ తిలకం దిద్దాడు.

దేవుడు ఎదుటనున్న మండపం కాళీచేయించి హోప్‌లెస్‌గాడిని అక్కడ నిలబెట్టారు. ఇంతలో నరసింహారావు భార్య ఖద్దరు చీర కట్టుకొని ఖద్దరు రవిక తొడుక్కున్న ఒక పడుచును పెళ్ళికూతురు ముస్తాబులో తీసుకొచ్చింది. ఆమెను తెచ్చి సుందరం పక్కను నిలబెట్టారు.

"నా పెళ్ళికి మీరందరూ అభిమానంతో వచ్చారు. మీ అందరికీ ధన్యవాదాలు. మీ అందరికి అభిమానియైన ఈ సుందరం, ఉరఫ్ హోప్లెస్‌గాడి పెళ్ళి మీరిప్పుడు జరిపించవలసింది. వధూవరులు దండలు మార్చుకొని ఒకరి నొకరు జీవితాంతం విడువమని దేవుడి ఎదుట ప్రమాణం చేస్తారు. మీరు ఈ వివాహాన్ని కళ్ళ వేడుకగా చూసి ఆశీర్వదించండి." అన్నాడు గురునాథం పంతులు.

దేవుడి ఎదుట సింహాచలం సుందరం మెడలో పూలదండ వేసి, వాడు వేసే దండకు తలవంచింది. చప్పట్లు తరువాత అక్షతలు- పూల రేకులు- వాటిలో మునిగిపోయారు సింహాచలం, సుందరాలు.

(అయిపోయింది)